# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 233 | విశాఖపట్నం | 24-5-2026 ఆదివారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 233 | VISAKHAPATNAM | 24-5-2026 SUNDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram




SBI
PATHAKAM NEWS
SCAN & PAY
UPI ID: 44576280686@sbi
BHIM | UPI
yono SBI | BHIM SBI Pay
G Pay | Paytm | PhonePe




## వేగంగా విస్తరిస్తున్న కాంగోలో ఎబోలా వైరస్

5లో



2లో

## ఏపీలోని పలు జిల్లాల్లో గాలి వాన బీభత్సం సృష్టించే అవకాశం: రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ



6లో

## ఎండలు పెరుగుతున్న వేళ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి

# అధ్వానంగా పాడేరు- జోలాపుట్టు రోడ్డు!



**పాడేరు, పతాకం న్యూస్:** గత ఎనిమిదేళ్లుగా నిర్లక్ష్యానికి గురైన పాడేరు- జోలాపుట్టు మెయిన్‌రోడ్డులోని పెదబయలు మండల పరిధిలోకి వచ్చే ఐదు కిలోమీటర్ల రోడ్డును అభివృద్ధికి చేసేందుకు కూటమి ప్రభుత్వం రూ.9.6 కోట్లు మంజూరు చేసింది. దీంతో ఈ ఏడాది జనవరిలో రోడ్డు గుంతలు పూడ్చడం, వెడల్పు చేయడం వంటి పనులు ప్రారంభించారు. మరికొన్ని రోజుల్లో రోడ్డు నిర్మాణం పూర్తయి ఇన్నాళ్ల అవస్థలు తీరుతాయని భావించినప్పటికీ, అందుకు భిన్నంగా జనవరి నుంచి ఇప్పటికీ ఆ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయకుండా అసంపూర్తిగానే వదిలేశారు.

జిల్లా కేంద్రం పాడేరు నుంచి పెదబయలు మీదుగా ముంచంగిపుట్టు, జోలాపుట్టు, అటుగా ఒడిశా రాష్ట్రానికి రాకపోకలు సాగిస్తున్న డ్రైవర్లు, ప్రయాణికులు నిత్యం నరకం చూస్తున్నారు. ఐదు కిలోమీటర్ల రోడ్డును తవ్వేసి మెటల్, మట్టి వేసి ఐదు నెలలుగా వదిలేశారు. దీంతో ఈ మార్గంలో ప్రమాణించేవారికి ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యంగా ద్విచక్రవాహన చోదకులు నిత్యం ప్రమాదాలకు గురికావడంతోపాటు ముందుగా పెద్ద వాహనాలు వెళితే ఆ ధూళికి మరింత ఇబ్బందికి గురవుతున్నారు. రోడ్డుపై మెటల్ పరిచి వదిలేయడంతో కార్లు, జీపుల టైర్లు పంక్చర్ అవుతున్నాయని డ్రైవర్లు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అలాగే వర్షం కురిస్తే ఈ మార్గంలో రాకపోకలు సాగించలేకపోతున్నామని వాపోతున్నారు. అధికారులు స్పందించి ఈ రోడ్డును త్వరలో పూర్తి చేయాలని మన్యం వాసులు కోరుతున్నారు.

## విశాఖ నగరంలో
# చోరీలకు అడ్డుకట్ట

పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** నగరంలో చోరీలకు అడ్డుకట్ట వేయడంతో పాటు, బాధితులకు సత్వర న్యాయం చేయడమే లక్ష్యంగా విశాఖ క్రైమ్ విభాగం పోలీసులు పనిచేస్తున్నారని సీపీ శంఖబ్రత బాగ్చి తెలిపారు. ఇందులో భాగంగా విశాఖ పోలీస్ కమిషనరేట్‌లో నిర్వహించిన ఏప్రిల్ నెల 'రికవరీ మేళా'లో రికార్డు స్థాయిలో రికవరీ చేసిన సొత్తును బాధితులకు అందజేశారు. ఏప్రిల్ నెలలో కమిషనరేట్ పరిధిలో మొత్తం 68 చోరీ కేసులు నమోదు కాగా, సాంకేతికత, చాకచక్యంతో వ్యవహరించిన క్రైమ్ పోలీసులు కేవలం నెల రోజుల్లోనే 51 కేసులను (తరువాయి 2వ పేజీలో)

# ఆగస్టు 15లోపు రాష్ట్ర వ్యాప్తంగా సంజీవని: చంద్రబాబు




**చిత్తూరు, పతాకం న్యూస్:** "ఆహారమే ఔషధం, వంటశాలే ఔషధ శాల. ఈ మాట నేను ఎప్పుడూ చెబుతాను. మనం తినే ఆహారమే మనకు తిరుగులేని ఆరోగ్యాన్ని అందిస్తుంది" అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం, యాదమరి మండలం కంద్రిగలో నిర్వహించిన 'సంజీవని' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను వివరించారు. తన వరకు తాను పూర్తి ఆహార నియమాలు పాటిస్తానని, మంచి అలవాట్లు, మంచి ఆహారం, వ్యాయామం, మంచి ఆలోచనల ద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. యోగా, ధ్యానం, ప్రాణాయామం వంటివి జీవనశైలిలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సంపద ఉన్నవాళ్లకంటే ఆరోగ్యంగా ఉన్నవాళ్లే అదృష్టవంతులని ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా 'సంజీవని' కార్యక్రమం ప్రాముఖ్యతను సీఎం వివరించారు. "రామ రావణ యుద్ధంలో లక్ష్మణుడి (తరువాయి 2వ పేజీలో)

# కశింకోటలో రోడ్డు ప్రమాదం.. ఇద్దరు మృతి

**కశింకోట, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా కశింకోట మండలం ఉగ్గినపాలెం కాళీ ప్రసాద్ పెట్రోల్ బంకు 16 జాతీయ రహదారిపై ఆగిన వున్న ట్రాలీ లారీని శనివారం తెల్లవారుజామున యలమంచిలి వైపు నుండి విశాఖ వైపు వెళుతున్న మినీ వ్యాన్ ఢీకోట్టింది అని కశింకోట ఎస్ఐ లక్షణరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఈ ప్రమాదంలో వ్యాన్ లో ప్రయాణం చేస్తున్నా గాజువాక శ్రీహరిపురం జనతా కొలనీకి చెందిన సూరిశెట్టి జ్యోతి (31), మునగపాక మండలం అరవపాలెం గ్రామానికి చెందిన ఆడారి కూర్మా రావు (45) అక్కడ అక్కడ



మృతి చెందగా మరో 4 గురు గాయపడ్డారు. గాయపడ్డ వారిని అంబులెన్సులో అనకాపల్లి ఆసుపత్రికి తరలించారు.

లారీ డ్రైవర్, మినీ వేను డ్రైవర్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు.

## అందరం కలిసికట్టుగా మహానాడును
# విజయవంతం చేద్దాం: లోకేశ్



**అమరావతి, పతాకం న్యూస్:** అందరం కలిసికట్టుగా మహానాడును విజయవంతం చేయాలని టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. శనివారం క్లస్టర్ ఇన్‌ఛార్జిలతో నిర్వహించిన సమావేశంలో మహానాడుకు సంబంధించి మంత్రి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. మహానాడును పండుగ వాతావరణంలో నిర్వహించాలన్నారు. కార్యకర్తలంతా ఉత్సాహంగా, ఐక్యతగా పాల్గొనాలని సూచించారు. ఈ మహానాడు క్లస్టర్ బలోపేతానికి మంచి అవకాశమని అభిప్రాయపడ్డారు. కేఎస్-ఎస్, బూత్, గ్రామ స్థాయి, అనుబంధ కమిటీల (తరువాయి 3వ పేజీలో)



## మండుటెండలో ఆక్వా రైతుల ఆందోళన

2లో


పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా..
అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా..
పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS
State Bank of India
A/c No: 44576280686
IFSC:SBIN00021297
DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## కనీస వేతనాలు..

కార్మికులకు కనీస వేతనాలు పెంచుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం హర్షణీయం. ఉమ్మడి రాష్ట్రం లో ప్రకటించిన పధ్నాలుగు సంవత్సరాల తరువాత ఆ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడీ ప్రకటన వెలువరించింది. తెలంగాణలోని ఒక కోటి పదకొండు లక్షల మంది కార్మికులకు ప్రయోజనం కలుగుతుంది కనుక ఈ నిర్ణయం విస్తృత ప్రభావం వేస్తుంది. కనీస వేతనం పెంచుతూ ప్రకటించడం బాగానేవుంది కానీ ఆ పెంపుదల శాస్త్రీయంగా లేదన్నది వాస్తవం. ఈ పధ్నాలుగేళ్లలో పెరిగిన ధరలతో పోల్చితే ఈ పెంపుదల స్వల్పమే! కనీస వేతనాలను రాష్ట్రంలో 3 జోన్లుగా, వేతనాలను 4 క్యాటగిరీలుగా విభజించి ప్రకటించారు. అందులోనూ శాస్త్రీయత కొరవడింది. ఆయా జోన్లలో అన్ని రంగాల్లో ఒకే రీతిలో పెంచడం వల్ల గతంలో ఎంప్లాయ్‌మెంట్‌లో వివిధ రకాల పనులకు ఆయా రకాలుగా ఉన్న పద్ధతి లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తమవుతోంది. కనీస వేతనాల పెంపుదల సందర్భంగా కరువుభత్యం గురించి ప్రస్తావించకపోవడంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారు. పెరిగిన వేతనాలు కూడా 4 క్యాటగిరీల్లో ఒక్క అన్‌స్కిల్డ్ వర్కర్లకు తప్ప మిగతా వారికి బేసిక్ కరువుభత్యం కలుపుకుని ఇప్పటికే వస్తున్న జీతానికి, పెరిగిన దానికి పెద్ద తేడా ఏమీ లేకపోవడం గమనార్హం. తెలంగాణ కాంట్రాక్టు లేబర్ జీవో నెం 11 ప్రకారం ఇప్పటికే కార్మికులు రూ.13,098 నుంచి రూ. 23,683 వరకు వేతనాలు పొందుతున్నారు. దీన్ని బట్టి చూస్తే ప్రభుత్వం పెంచింది పెద్దగా ఏమీ లేదు కదా! తెలంగాణ జీవో 4లో స్కిల్డ్ కార్మికుడికి వేతనం రూ.19,572 ఉండగా సీఎం ప్రకటించిన వేతనం రూ.18,500 మాత్రమే! గతంతో పోలిస్తే రూ.1072 తగ్గింది. ఇప్పటి వరకు అనుసరించాల్సిన ఏ ప్రామాణికాన్ని కూడా పరిగణనలోకి తీసుకోలేదని కార్మిక సంఘాలు చేస్తున్న విమర్శ సత్య దూరం కాదు. పెరిగిన ధరలు, 1948 కనీస వేతనాల చట్టం, డాక్టర్ ఆక్రాయ్ ఫార్ములా, సుప్రీంకోర్టు తీర్పులకు అనుగుణంగా వేతనాలు లెక్కిస్తే రూ.32 వేలు వస్తుంది. అయినప్పటికీ కార్మిక సంఘాలు కనీస వేతనం రూ.26 వేలు ఉండాలని డిమాండ్ చేస్తున్నాయి. కార్మిక సంఘాల డిమాండ్లను పరిగణనలోకి తీసుకొని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన కనీస వేతనాలను సవరించాలి. పొరుగు రాష్ట్రం చేసింది చూసి అయినా ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం కార్మికులకు కనీస వేతనాలు వెంటనే ప్రకటించడం కనీస ధర్మం. ఇక్కడ 72 షెడ్యూల్డ్ పరిశ్రమల్లో 50 లక్షల మందికి పైగా కార్మికులకు ఈ కనీస వేతనాలు వర్తిస్తాయి. ఉమ్మడి రాష్ట్రం లో ప్రకటించినదే తప్ప ఇక్కడ టిడిపి లేదా వైసిపి పాలకులు ఏనాడూ వాటిని పట్టించుకోలేదు. టిడిపి కూటమి సర్కారు ఇప్పుడైనా మేలుకోవడం అవసరం. ఇప్పటికే అన్ని నిత్యావసర సరుకులతో పాటు ధరలన్నీ పెరిగి కార్మికుల బతుకులు దుర్భరంగా మారాయి. వాస్తవ పరిస్థితి గుర్తించి వెంటనే కనీస వేతనాలు పెంచాలి. దేశ రాజధాని ప్రాంతం లోని నోయిడా పారిశ్రామిక కార్మికుల ఆందోళన గురించి ఒకసారి గుర్తుకు తెచ్చుకుంటే కనీస వేతన పెంపు ప్రకటన ఆవశ్యకత ఏమిటో పాలకులకు బోధపడుతుంది. అంతేగాక పొరుగున వున్న హర్యానా సర్కారు వేతన పెంపు ప్రకటన వెల్లడించాక ఉత్తరప్రదేశ్ లోని యోగి ప్రభుత్వం బండ రాయిలా మిన్నకుండడం కడుపు మండి వున్న కార్మికుల ఆగ్రహానికి ఆజ్యం పోసింది. కార్మికుల ఆగ్రహం కట్టలు తెంచుకున్న తీరు జ్ఞప్తికి తెచ్చుకుంటే సర్కారు పెద్దల్లో కదలిక వస్తుంది. ఈ రెండు నెలల్లో యుద్ధం పేరిట భారాలు మరింత పెరిగాయి. ఈ నేపథ్యాన్ని పరిగణన లోకి తీసుకోవడంతో పాటు పొరుగు రాష్ట్రం ప్రకటించిన దాంట్లోని లోపాలను సవరించి తాజాగా కనీస వేతనాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వెంటనే ప్రకటించాలి. ఆలస్యం అనర్థ దాయకం అని గుర్తెరగాలి. లేనిపక్షంలో కార్మికుల ఆందోళనలకు లేదా వ్యక్తమయ్యే ఆగ్రహానికి రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది. నిరంతరం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లేదా పెట్టుబడుల ఆకర్షణ జపం చేస్తూ కార్పొరేట్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న పాలకులు శ్రమ జీవుల గురించి కొద్దిగానైనా పట్టించుకోరా? వెంటనే కనీస వేతన పెంపు ప్రకటన చేసి విజ్ఞత ప్రదర్శించండి.

## కాక్‌రోచ్ జనతా పార్టీ వెబ్‌సైట్ తొలగింపు.. కేంద్రంపై అభిజీత్ దీప్కే మండిపాటు..




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** యువతలో విపరీతమైన క్రేజ్ సంపాదించుకున్న ఫేమస్ సోషల్ మీడియా పేజీ 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ – జజ్పీ) కి మరో షాక్ తగిలింది. ఇప్పటికే ఎక్స్ అకౌంట్ నిలిపివేత, ఇన్‌స్టాగ్రామ్ హ్యాకింగ్ ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఇప్పుడు పార్టీ అధికారిక వెబ్‌సైట్ కూడా పనిచేయడం ఆగిపోయింది. ఈ ఘటనపై స్పందించిన పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. 'ప్రభుత్వం కాక్‌రోచ్‌లకు ఎందుకు భయపడుతోంది? ఇది నియంతృత్వ ధోరణి' అంటూ సోషల్ మీడియాలో వ్యాఖ్యానించారు. అలాగే 'కాక్‌రోచ్‌లు ఎప్పుడూ చావవు' అంటూ కొత్త ప్లాట్‌ఫామ్‌పై పని చేస్తున్నామని తెలిపారు. తమను అణచివేసే కుట్ర జరుగుతోందని అభిజిత్ దిప్కే ఆరోపణలు చేశారు. 'కాక్రోచ్ జనతా పార్టీ' ఒక సోషల్ మీడియా ఉద్యమంగా ప్రారంభమైంది. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, పరీక్షల లీకులు, యువత సమస్యలపై సెటైరికల్ పోస్టులతో ఈ ఉద్యమం తక్కువ సమయంలోనే భారీ ఫాలోయింగ్ సంపాదించింది. ఇన్‌స్టాగ్రామ్‌లో కోట్లాది మంది ఫాలోవర్లు రావడంతో దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇటీవల పార్టీ ఎక్స్ అకౌంట్‌ను ఇండియాలో నిలిపివేయడం, ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ హ్యాక్ అయిందని ఆరోపణలు రావడం సంచలనంగా మారింది. ఈ పరిణామాలపై సోషల్ మీడియాలో విభిన్న స్పందనలు వస్తున్నాయి. కొందరు దీన్ని భావ ప్రకటన స్వేచ్ఛపై దాడిగా విమర్శిస్తుండగా, మరికొందరు ఇది కేవలం వైరల్ రాజకీయ వ్యంగ్య ప్రచారమేనని అభిప్రాయపడుతున్నారు.

## ఏపీలోని పలు జిల్లాల్లో గాని వాన బీభత్సం సృష్టించే అవకాశం: రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ



**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్రంలోని పలు జిల్లాల్లో గాని వాన బీభత్సం సృష్టించే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. వచ్చే మూడు గంటల్లో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. అల్లూరి, అనకాపల్లి, కాకినాడ, విజయనగరం జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. వర్షం పడినప్పుడు చెట్లు, స్తంభాలు, హోర్డింగ్‌ల కింద నిలబడవద్దని సూచించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్న రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. మరోవైపు ఎల్‌నినో ప్రభావంతో వాతావరణంలో మార్పులు జరుగుతున్నాయి. రాష్ట్రమంతా భానుడి భగభగలకు మండిపోతుంటే మరికొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలో గాలివాన బీభత్సం సృష్టించింది. ఉదయం నుంచి తీవ్రమైన వడగాలులతో జనం అల్లాడిపోగా... సాయంత్రానికి ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. దాదాపు అరగంట పాటు ఎడతెరిపి లేకుండా ఈదురుగాలులతో కూడిన భారీవర్షం కురిసింది. పలు గ్రామాలలో ఈదురుగాలుకు భారీ చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. కొన్నిచోట్ల ఇళ్లు దెబ్బతిన్నాయి. ముకుందరాజుపేటలో ఇంటిపైకప్పు రేకులు పడి ఇద్దరు మహిళలు గాయపడ్డారు. మామిడి, అరటి వంటి ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందంటూ రైతులు వాపోతున్నారు. అనంతపురం నగరంలో తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి కొన్ని ప్రాంతాల్లో భారీ వృక్షాలు నేలకొరిగాయి. ఉరుములు మెరుపులతో కూడిన వర్షం దాదాపు గంట పాటు కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

## మండుటెండలో ఆక్వా రైతుల ఆందోళన



**పాలకొల్లు, పతాకం న్యూస్:** "ఆక్వా రంగంలో సిండికేట్ వ్యవస్థ రాజ్యమేలుతోంది. ఆరుగాలం శ్రమిస్తున్న మాకు అన్నీ నష్టాలే.. ఒక పక్క మేత ధరలు పెంపు, మరోపక్క రొయ్య ధర కిలోకు రూ.50 తగ్గింపుతో రోజు రోజుకు ఆర్థికంగా నష్టపోతున్నాం.. ఇక ఆత్మ హత్యలే శరణ్యం.." అంటూ మండు టెండలో భీమవరం-పాల కొల్లు రహదారిలో పూలపల్లి వైజంక్షన్ వద్ద ఆక్వా రైతుల తమ చెర్వుల్లోని రొయ్యలను తీసుకొచ్చి రోడ్డుపై పారబోసి నిరసన వ్యక్తం చేశారు. ఆచంట, పాలకొల్లు, నరసాపురం నియోజకవర్గాలకు చెందిన రైతులు మానవహారం నిర్వహించారు. సిండికేట్ వ్యవస్థపై చర్యలు తీసుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యమంటూ మెడకు ఉరితాళ్లు బిగించుకుని నిరసన తెలిపారు. పాలకొల్లు జైభారత్ క్షీరారామ ఆక్వా సంఘం చైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు మాట్లాడుతూ ఆక్వా ఫీడ్, సీడ్ ప్యాక్టరీలు, ప్రోసెసింగ్ యూనిట్లు, కొనుగోలుదారుల సిండికేట్ వల్ల రైతులు ఆర్థికంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కిలో రూ.270 ఉంటే రూ.220లకు కొనుగోలు చేస్తున్నారని కిలోకు రూ.50 నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీడ్ కంపెనీలు తరచూ ?ధరలు పెంచడంతో ఆక్వా సంఘాలు ఆందోళన చేస్తుంటే ?ధరలు తగ్గించినట్టు తగ్గించి మళ్లీ వారానికో పదిహేను రోజులకో పెంచేస్తున్నారని మళ్లీ ఇప్పుడు టన్నుకు రూ.8 వేలు ధర పెంచడం రైతుకు భారంగా మారిందన్నారు. భవిష్యత్తులో ఆక్వా సాగు కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడనున్నదని ప్రభుత్వం సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## జగన్‌పై మంత్రి అనగాని ఫైర్



**అమరావతి, పతాకం న్యూస్:** గొడ్డలి పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కొత్తగా తాను చాలా అమాయకుణ్ణి, అహింసావాదిని అంటూ మాట్లాడుతున్నారని మంత్రి అనగాని సత్యప్రసాద్ సెటైర్ విసిరారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. జగన్ పూర్వీకుల చరిత్ర, ఆయన చరిత్ర ఏంటి అనేది ప్రపంచంలో అందరికీ తెలుసన్నారు. ఎన్ని దారుణాలు చేశారో, ఎన్ని హత్యలు చేశారో రాయలసీమలో ఏ గడపని అడిగినా చెప్తారని అన్నారు. రాజారెడ్డి రాజ్యాంగం గురించి ఎవరిని అడిగినా కథలు కథలుగా చెప్తారని వ్యాఖ్యానించారు. అటువంటి రాజారెడ్డి పోలికలు తనకొచ్చాయని చెప్పుకున్న వ్యక్తి జగన్ అంటూ దుయ్యబట్టారు. గొడ్డలి పార్టీ అధ్యక్షుడు చేసిన అరాచకాలు కళ్లారా చూశామని మంత్రి అన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అధికారాన్ని అడ్డంపెట్టుకుని.. తన వ్యాపారానికి అడ్డుగా ఉన్న ప్రతి ఒక్కరినీ హతమార్చారని జగన్‌పై మంత్రి ఆరోపణలు గుప్పించారు. పరిటాల రవితో సహా ఎంతోమందిని హత్య చేశారన్నారు. అమరనాథ్ గౌడ్, సుధాకర్, డ్రైవర్ సుబ్రహ్మణ్యం విషయంలో ఏమైందో అందరికీ తెలుసన్నారు. 'తల్లిని తరిమేశాడు.. చెల్లిని ఆస్తి కోసం తరిమేశాడు.. అతని వ్యక్తిత్వం అలాంటిది' అంటూ వ్యాఖ్యానించారు. బాబాయ్ హత్య కేసుపై సీబీఐ వచ్చి ఎంక్వైరీ చేస్తుంటే.. తన పార్టీ ఎంపీని కాపాడేందుకు సీబీఐ అధికారులపైనే దాడి చేసి తరిమేశారని మండిపడ్డారు. వైఎస్ సునీత ఆవేదన కనిపించటం లేదా అని మంత్రి ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా చేసిన ఐదేళ్లలో బాబాయ్‌ను హత్య చేసిన వ్యక్తిని కనుక్కోలేకపోయారా అని నిలదీశారు. తప్పుదోవ పట్టిద్దామనుకుంటే నమ్మే స్థితిలో ఏపీ ప్రజలు లేరన్నారు. ఇప్పుడు ఆ 11 సీట్లు కూడా వచ్చే పరిస్థితి లేదని అన్నారు. 'ఈరోజు రాష్ట్రం సుభిక్షంగా ఉంది. పెట్టుబడులు భారీగా వస్తున్నాయి. యువత హ్యాపీగా ఉంది. ఉద్యోగాలు వస్తున్నాయి. అభివృద్ధి, సంక్షేమం జరుగుతోందన్న ఆనందంలో ప్రజలు ఉన్నారు' అని మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు.

(మొదటిపేజీ తరువాయి)

## ఆగస్టు 15లోపు రాష్ట్ర వ్యాప్తంగా సంజీవని: చంద్రబాబు

ప్రాణాలు కాపాడేందుకు హనుమంతుడు సంజీవనిని తీసుకొచ్చారు. అదే స్ఫూర్తితో, డిజిటల్ హెల్త్ రికార్డులతో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఈ కార్యక్రమానికి 'సంజీవని' అని పేరు పెట్టాం. సంపద కంటే ఆరోగ్యమే గొప్పది. అందుకే ఆరోగ్యమే మహాభాగ్యమని పెద్దలు అన్నారు" అని చంద్రబాబు పేర్కొన్నారు. వ్యాధులు రాకముందే గుర్తించి, నివారించేందుకు ప్రిడిక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానంలో ఈ ప్రాజెక్టును రూపొందించినట్లు తెలిపారు. గత జూలైలో కుప్పంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించి, మార్చి 15 నుంచి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని 19.75 లక్షల మంది ఆరోగ్యాన్ని కాపాడేలా చర్యలు తీసుకుంటున్నామని, ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రాజెక్టును ప్రారంభిస్తామని ప్రకటించారు. ఈ పథకంలో భాగంగా 42 రకాల వైద్య పరీక్షలను ప్రజల ఇళ్ల వద్దే నిర్వహించి, రిపోర్టులు అందిస్తామన్నారు. డాక్టర్ అపాయింట్‌మెంట్, వర్చువల్ కనెక్ట్ ద్వారా వైద్య సలహాలు, వ్యక్తిగత ఆరోగ్య రికార్డుల డిజిటలైజేషన్ వంటి సేవలు అందిస్తున్నట్లు వివరించారు. త్వరలోనే ఏఐ డాక్టర్ ద్వారా కూడా వైద్యసేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి వ్యక్తికి ఒక ఏఐ డాక్టర్ ఉంటాడని స్పష్టం చేశారు. వైద్య ఖర్చుల భారం నుంచి కుటుంబాలను గట్టెక్కించడమే ప్రభుత్వ లక్ష్యమని, విద్య, వైద్య రంగాలకు ప్రజా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ ఏడాది వైద్యరంగానికి రూ.19,305 కోట్లు కేటాయించామని, 15వ ఆర్థిక సంఘం నుంచి దేశంలోనే అత్యధికంగా రూ.2,601 కోట్ల ఆరోగ్య గ్రాంట్లు సాధించామని గుర్తుచేశారు. యూనివర్సల్ హెల్త్ పాలసీ కింద ప్రతి ఒక్కరికీ రూ.2.5 లక్షల విలువైన వైద్యం, ఎన్టీఆర్ వైద్య సేవ, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.25 లక్షల వరకు ఖర్చులు భరిస్తామని హామీ ఇచ్చారు. ప్రకృతి బాగుంటేనే మనం బాగుంటామని, పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని సీఎం అన్నారు. సమర్థ నీటి నిర్వహణతో భూగర్భ జలాలను పెంచగలిగామని, దీనికి అన్నమయ్య జిల్లానే నిదర్శనమని చెప్పారు. ప్రభుత్వ యంత్రాంగం చర్యలతో అక్కడ భూగర్భ జలాలు 8.5 మీటర్లు పెరిగి, పచ్చదనం పెరిగిందన్నారు. రాష్ట్రమంతా తీవ్ర ఉష్ణోగ్రతలు ఉంటే, అన్నమయ్య జిల్లాలో ఉష్ణోగ్రతలు తగ్గాయని, పిడుగురాళ్లలో 49 డిగ్రీలు నమోదైతే, అన్నమయ్యలో 40 డిగ్రీలే ఉందని నివేదికలను ఉటంకించారు. సాగునీటి ప్రాజెక్టులపై సంకల్పంతో పనిచేస్తున్నామని, ఏ ప్రాజెక్టు ఎప్పుడు పూర్తి చేస్తామో క్యాలెండర్ విడుదల చేశామని చంద్రబాబు తెలిపారు. నీవా పనులు పూర్తిచేసి పూతలపట్టు మీదుగా చిత్తూరు వరకు కృష్ణా నీటిని తెస్తామని, కల్యాణి డ్యాంకు కూడా నీళ్లిస్తామని హామీ ఇచ్చారు. గాలేరు-నగరి, మల్లెమడుగు, సోమశిల-స్వర్ణముఖి లింక్ కెనాల్ వంటి ప్రాజెక్టుల పూర్తికి గడువులను ప్రకటించారు. ప్రజల భవిష్యత్తుకు భరోసా ఇవ్వడమే తమ లక్ష్యమని, ఆ దిశగా నిరంతరం పనిచేస్తామని స్పష్టం చేశారు.

## చోరీలకు అడ్డుకట్ట

ఛేధించారు. ఈ కేసులతో సంబంధం ఉన్న 60 మంది ముద్దాయిలను అదుపులోకి తీసుకున్నారు. ఈ ముద్దాయిల నుంచి రూ. 1.04 కోట్ల విలువైన ప్రాపర్టీని స్వాధీనం చేసుకున్నారు. ఇందులో 924.14 గ్రాముల బంగారం, 4.5 కేజీల వెండి మరియు రూ. 3.12 లక్షల నగదు ఉన్నాయి. ఈ సొత్తును పోలీస్ కమిషనర్ (సీపీ) శంఖబ్రత బాగ్చి చేతుల మీదుగా శనివారం బాధితులకు సురక్షితంగా అప్పగించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. గడిచిన 22 నెలల్లో విశాఖ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అద్భుతమైన పనితీరు కనబరిచామని, మొత్తం 9,202 మంది బాధితులకు సుమారు రూ. 22 కోట్ల విలువైన ప్రాపర్టీని రికవరీ చేసి అందజేశామని వెల్లడించారు. ఇటీవల నగరంలో కలకలం రేపిన హనీ ట్రాప్ కేసుపై సీపీ స్పందిస్తూ.. ఈ కేసులో ప్రధాన నిందితుడిని ఇప్పటికే అదుపులోకి తీసుకున్నామని, దీని వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా అనే కోణంలో లోతుగా విచారణ జరుపుతున్నామని తెలిపారు. అలాగే నగరంలో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని శంఖబ్రత బాగ్చి పిలుపునిచ్చారు. ఆన్‌లైన్ లోన్ యాప్‌లు, పార్ట్ టైమ్ జాబ్స్ పేరుతో మోసాలు జరిగినా, లేదా ఎవరైనా ఆన్‌లైన్‌లో అసభ్యకరంగా బ్లాక్‌మెయిల్‌కు పాల్పడినా ఏమాత్రం భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని లేదా జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్‌ను ఆశ్రయించాలని సీపీ శంఖబ్రత బాగ్చి స్పష్టం చేశారు.

# ఆపరేషన్ క్లీన్‌స్వీప్ లో ప్రజలు భాగస్వాములు కావాలి



**విజయనగరం, పతాకం న్యూస్:** పట్టణాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరిచి, పరిశుభ్రంగా రూపొందించే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో ప్రజలంతా స్వచ్ఛందంగా భాగస్వాములై విజయవంతం చేయాలని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎస్. సేధు మాధవన్ పిలుపునిచ్చారు. నెల రోజుల ఈ ప్రత్యేక కార్యక్రమానికి ఎంఎల్‌ఏ పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజుతో కలిసి శనివారం ఉదయం స్థానిక జెడ్‌పి కార్యాలయం సమీపంలో శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా వాటర్ ట్యాంకర్లతో యెల్లో స్పాట్లను కడిగి దుర్వాసనను తొలగించే ప్రక్రియను, గోడలకు సున్నం వేసి మోరల్ పెయింటింగ్ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పట్టణంలో పచ్చదనాన్ని పెంచేందుకు మొక్కలు నాటారు. ముందుగా జెండా ఊపి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి కలెక్టర్ సేధు మాధవన్ మాట్లాడుతూ, ప్రజల భాగస్వామ్యం ఉన్నప్పుడే కార్యక్రమం విజయవంతం అవుతుందని అన్నారు. వారానికో ప్రాధాన్యతాంశంతో నెలరోజులపాటు ఆపరేషన్ క్లీన్ స్వీప్ నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. దీనిలో భాగంగా పట్టణాల్లో గుర్తించిన 150 రెడ్, యెల్లో, బ్లాక్ స్పాట్లను గ్రీన్ స్పాట్లుగా మార్చడం, బల్క్ వేస్ట్ ఉత్పత్తి దారులకు అవగాహన కల్పించి, నిర్మూలనా చర్యల్లో వారిని భాగస్వాములను చేయడం జరుగుతుందని చెప్పారు. యెల్లో స్పాట్స్‌ను గ్రీన్ స్పాట్స్‌గా మార్చి గోడలపై నైతిక బోధనలతో కూడిన పెయింటింగ్స్ వేయిస్తామని తెలిపారు. ప్రజలు తమ ఇంటివద్దనే తడిచెత్త, పొడిచెత్తగా వేరుచేసి ఇవ్వాలని సూచించారు. విజయనగరాన్ని పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన కార్పొరేషన్ గా మార్చడంలో ప్రజలంతా తమవంతు సహకారాన్ని అందించాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ కోరారు. ఎంఎల్‌ఏ అదితి విజయలక్ష్మి గజపతిరాజు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రాన్ని పరిశుభ్రంగా మార్చాలని ఆపరేషన్ క్లీన్ స్వీప్ నిర్వహిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం చెత్తపన్ను వసూలు చేసినప్పటికీ, ఎక్కడికక్కడ చెత్త పేరుకొనేలా చేసిందని అన్నారు.

# హోం గార్డులకు సమగ్ర ఆరోగ్య బీమా పథకం ప్రారంభం



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** హోం గార్డుల కోసం సమగ్ర ఆరోగ్య బీమా పథకాన్ని రాష్ట్ర హోం, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత విశాఖ నగర పోలీస్ కమిషనరేట్‌లో ప్రారంభించారు. హోం గార్డులు, వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య బీమా పాలసీ పట్టాలను అందజేశారు. విశాఖ సిపి డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆధ్వర్యంలో దేశంలోనే తొలి వినూత్న సంక్షేమ కార్యక్రమంగా ఈ పథకాన్ని అమలు చేశారు. అధిక ఒత్తిడి, ప్రమాదాలను ఎదుర్కొంటూ సేవలందిస్తున్న హోం గార్డులు తీవ్రమైన అనారోగ్యంతో, భారీ వైద్య ఖర్చులతో ఇబ్బందిపడుతున్న నేపథ్యంలో ఈ పథకాన్ని రూపొందించినట్లు అధికారులు తెలిపారు. విశాఖలోని ప్రతి హోం గార్డు కుటుంబానికి రూ.3 లక్షల బేస్ పాలసీతో పాటు రూ.30 లక్షల టాప్-అప్ కవరేజ్, అదనంగా రూ.3 లక్షల కాంప్లిమెంటరీ కవరేజ్ కల్పిస్తారు. మొత్తంగా రూ.33 లక్షల వరకు ఆరోగ్య బీమా సౌకర్యం లభించనుంది. హోం గార్డుల భార్య లేదా భర్తతో పాటు ఇద్దరు పిల్లలకు ఈ బీమా వర్తిస్తుంది. దివీస్ లేబొరేటరీస్ సంస్థ నగర పోలీస్ శాఖకు రెండు ఎల్‌ఎంవి వాహనాలను అందజేసింది.

# నేడు విశాఖలో యూపీపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్ష



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని 17 కేంద్రాల్లో సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలు నిర్వహించనున్నట్టు జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి తెలిపారు. ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు పేపర్-2 పరీక్ష జరుగుతుందన్నారు. ఈ పరీక్షలకు 7,763 మంది హాజరవుతారని పేర్కొన్నారు. పరీక్ష ప్రారంభానికి అరగంట ముందు అభ్యర్థులు కేంద్రాలకు చేరుకోవాలని, తప్పనిసరిగా గుర్తింపుకార్డు తీసుకురావాలని సూచించారు. పరీక్ష నిర్వహణపై ఆమె శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అధికారులతో సమీక్షించారు. పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్నిరకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద మెటల్ డిటెక్టర్లు, లోపవర్ జామర్లు ఏర్పాటుచేయాలని, మొబైల్‌ఫోన్లు, బ్లూటూత్‌లు, ఇతర ఎలక్ష?ట్రనిక్ పరికరాలు అనుమతించవద్దని సూచించారు. కాగా సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలకు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.విశ్వేశ్వరనాయుడు సమన్వయ అధికారిగా, రాష్ట్ర ప్రభుత్వ పరిశీలకురాలిగా జేసీ విద్యాధరి, యూపీఎస్సీ పరిశీలకులుగా సౌరభ్‌సింగ్ వ్యవహరిస్తారు.

# విశాఖ జిల్లాలో భారీగా పెరిగిన
# విద్యుత్ వినియోగం



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. రాత్రి ఏడు గంటలైనా వడగాడ్పులు తగ్గడం లేదు. అత్యవసర పనులు ఉంటే తప్ప జనాలు బయటకు రావడం లేదు. రహదారులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఇళ్లలో కూడా ఫ్యాన్ల నుంచి కూడా వేడిగాలులు వస్తున్నాయి. ఏసీ ఉన్నవారు బిల్లు గురించి భయపడకుండా ఉదయం 11 గంటలకే ఆన్ చేస్తున్నారు. ఏసీలను 24 డిగ్రీల వద్ద ఉంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నా ఆ కూలింగ్ సరిపోక చాలామంది 16 నుంచి 18 డిగ్రీల వద్ద పెట్టుకొని ఉపశమనం పొందుతున్నారు. ఇక వాణిజ్య సంస్థల విషయానికి వస్తే షాపింగ్‌మాల్స్, సినిమా థియేటర్లలో సందర్శకులు, కొనుగోలుదారులు, ప్రేక్షకుల సంఖ్య తక్కువగా ఉన్నా సరే ఏసీలు నిరంతరం ఉపయోగించాల్సి వస్తోంది. ఇంట్లో ఏసీ సదుపాయం లేని కొందరు ఏ థియేటర్‌లో ఏసీ బాగుంటుందో చూసుకొని అక్కడకు వెళుతున్నారు. మ్యాట్నీ షోలకు ఈ తరహా ప్రేక్షకులు ఎక్కువగా వస్తున్నారు. గత ఏడాది (2025) మే నెలలో విశాఖపట్నం సర్కిల్ (జిల్లా)లో విద్యుత్ డిమాండ్ సగటున 750 మెగావాట్లు. అత్యధికంగా 13వ తేదీన 889 మెగావాట్లు దాటింది. ఆ రోజున వినియోగదారులు 17.41 మిలియన్ యూనిట్ల విద్యుత్ వాడారు. 10వ తేదీన డిమాండ్ 888 మెగావాట్లు నమోదైంది. ఆ రోజు 17.25 మిలియన్ యూనిట్లు ఉపయోగించారు. 4వ తేదీన అత్యల్పంగా 619 మెగావాట్లే డిమాండ్ ఉంది. ఆ రోజు 12.5 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగించారు. ఈ ఏడాది మే నెలను గమనిస్తే విద్యుత్ డిమాండ్ వేయి మెగావాట్లు దాటిపోయింది. ఈ నెలలో గత 21 రోజుల్లో ఆరుసార్లు వేయి మెగావాట్లు దాటి డిమాండ్ నమోదైంది. ఇంకో పది రోజులు 900 మెగావాట్లు దాటింది. ఇంకో నాలుగు రోజులు 890 మెగావాట్లు దాటింది. అంటే గత ఏడాది కంటే సగటు డిమాండ్ 150 మెగావాట్లు ఎక్కువైంది. గణాంకాల ప్రకారం చూసుకుంటే వేయి మెగావాట్ల విద్యుత్ వినియోగించే నగరాల్లో విశాఖపట్నం కూడా చేరింది.

# జూన్ 1 నుంచి ఏయూ స్పెషల్ ఎగ్జామ్స్




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** డిగ్రీ (బీఏ, బీఎస్సీ, బీకాం కంప్యూటర్స్, బీబీఏ, బీసీఏ, బీహెచ్‌ఎం) కోర్సుల్లో బ్యాక్‌లాగ్స్ ఉండిపోయిన విద్యార్థుల కోసం నిర్వహించ తలపెట్టిన 'స్పెషల్ ఎగ్జామ్స్' ప్రారంభ తేదీని ఆంధ్ర విశ్వవిద్యాలయం అధికారులు ప్రకటించారు. పీజీ పరీక్షల తేదీలను కొద్దిరోజుల్లో ప్రకటిస్తామని వెల్లడించారు. జూన్ ఒకటో తేదీ నుంచి డిగ్రీ పరీక్షలు నిర్వహించనున్నట్టు ఎగ్జామ్స్ డిప్యూటీ రిజిస్ట్రార్ ఎం.పద్మరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా కోర్సుల్లో 2010-14 మధ్య చేరిన విద్యార్థులకు ఫస్ట్ ఇయర్ నుంచి థర్డ్ ఇయర్ వరకు ఉన్న పెండింగ్ సబ్జెక్టులు, 2015-19, 2020-2022 మధ్య చేరిన విద్యార్థులకు తొలి సెమిస్టర్ నుంచి ఐదో సెమిస్టర్ వరకు పరీక్షలు జూన్ ఒకటో తేదీ నుంచి ప్రారంభమవుతాయన్నారు. పరీక్షలకు మూడు రోజులు ముందు నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు ఏయూ వెబ్‌సైట్ చూడాలన్నారు.

# మన్యంలో ఎండల తీవ్రతకు గిరిజనులు విలవిల



**అరకులోయ, పతాకం న్యూస్:** మన్యంలో ఎండల తీవ్రతకు గిరిజనులు విలవిలలాడుతున్నారు. ఎండకుతోడు ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఉదయం నుంచే ఎండ ప్రభావం మొదలై, మధ్యాహ్నానికి మరింత తీవ్రమైంది. దీంతో మధ్యాహ్నం వేళల్లో జనం బయట తిరగలేని పరిస్థితి నెలకొంది. గత కొన్నిరోజులుగా రాత్రి పగలు తేడా లేకుండా ఉక్కపోత కొనసాగుతున్నది. ఉక్కపోతకు పట్టణాల్లో జనం చెట్ల నీడలో కూడా ఉండ లేక ఇళ్లలో ఏసీలు వేసుకొని ఉంటున్నారు. మారుమూల ప్రాంతాల్లో గిరిజనులు చెట్ల నీడలోనే గడుపుతున్నారు. ఏజెన్సీలో సీలేరులో 40 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కాగా.. కొయ్యూరులో 39.0 డిగ్రీలు, పాడేరు, జీకేవీధి, డుంబ్రిగుడలో 37.2, అనంతగిరిలో 36.6, చింతపల్లిలో 35.6, అరకులోయలో 35.4, జి.మాడుగులలో 32.9, ముంచంగిపుట్టులో 30.9, హుకుంపేటలో 30.2, పెదబయలులో 29.0 డిగ్రీల సెల్సియస్‌గా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కొయ్యూరు మండలంలో భానుడు తీవ్ర ప్రతాపం చూపించడంతో మండల కేంద్రంతోపాటు పలు ప్రధాన కూడళ్లు ఉదయం 11 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్మానుష్యంగా మారాయి. మండలంలో 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎండ తీవ్రతతోపాటు ఉక్కపోత కారణంగా ప్రజలు బయట తిరగలేని పరిస్థితి నెలకొంది. దీంతో మండల కేంద్రం బోసిపోయింది. అటు కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాలకు వెళ్లే ప్రధాన కూడలి అయిన కాకరపాడు సెంటరు కనీస జన సంచారం లేకుండా దర్శనమిచ్చింది. అలాగే చింతలపూడి, రావణాపల్లి, నడింపాలెం తదితర కూడళ్లు నిర్మానుష్యంగా మారాయి. ఎండ తీవ్రత కారణంగా కొయ్యూరు, మంప, రేవళ్లు, ఏలేశ్వరం, రాజమహేంద్రవరం వంటి ప్రాంతాలకు వెళ్లే ఆర్‌టీసీ బస్సులు ప్రయాణికులు లేకుండా తిరిగాయి. ఇప్పుడే ఎండలు ఇలా ఉంటే రోహిణి కార్తెలో ఎలా ఉంటాయోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# కోర్టు ఆదేశాలు బేఖాతరు



**అచ్యుతాపురం, పతాకం న్యూస్:** మండలంలోని దుప్పితూరులోగల భావనారుషి దేవస్థానానికి చెందిన భూమికి నష్టపరిహారం ఇవ్వకుండా ఏపీఐఐసీ అధికారులు ప్రహరీగోడ నిర్మిస్తుండడం వివాదాస్పదంగా మారింది. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించి గోడ నిర్మిస్తున్నారని ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మాడెం సూరి అప్పారావు ఆరోపించారు. వివరాల్లోకి వెళ్లే... దుప్పితూరు పంచాయతీ పరిధిలోని సర్వే నంబరు 275/1, 276/3లో 70 సెంట్ల భూమి భావనారుషి ఆలయం పేరున ఉంది. ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) భూసేకరణలో భాగంగా ఏపీఐఐసీ అధికారులు 2005లో ఈ భూమి కూడా సేకరించారు. కానీ పరిహారం చెల్లించలేదు. దీంతో అప్పటి నుంచి భూమిని ఆలయ అభివృద్ధి కమిటీ సాగుచేస్తూ వచ్చే ఆదాయాన్ని ఆలయంలో ధూప, దీప, నైవేద్యాలకు వినియోగిస్తున్నారు. ఆలయ భూమికి పరిహారం ఇప్పించాలని ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మాడెం సూరి అప్పారావు అధికారులను కోరారు. కానీ పట్టించుకోలేదు. అయితే ఇటీవల అధికారులు ఈభూమి చుట్టూ కంచె వేయడం ప్రారంభించారు. ఆయన అభ్యంతరం చెప్పి పనులు ఆపలేదు.. దీంతో ఆయన హైకోర్టుని ఆశ్రయించారు. కంచె వేసే పనులు ఆపాలంటూ కోర్టు ఈ నెల 21వ తేదీన ఉత్తర్వులు ఇచ్చింది. ఏపీఐఐసీ అధికారులకు ఈ విషయం తెలుసో లేదో కానీ ఏకంగా ప్రహరీ గోడ నిర్మాణం ప్రారంభించారు.

# మాతృత్వ సంరక్షణలో రాష్ట్రంలోనే
# ముంచంగిపుట్టు సీహెచ్‌సీ ప్రథమం



**ముంచంగిపుట్టు, పతాకం న్యూస్:** అల్లూరి జిల్లా ముంచంగిపుట్టు సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ) గిరిజన ప్రాంతంలో ప్రజలకు వైద్య సేవలు అందించడంలో సరికొత్త రికార్డు సృష్టించింది. మాతృత్వ సంరక్షణ (మెటర్నల్ కేర్) విభాగంలో ఈ ఏడాది మొదటి త్రైమాసికానికి రాష్ట్రంలోని అన్ని ద్వితీయ శ్రేణి ఆరోగ్య ఆసుపత్రుల కంటే అత్యధిక సురక్షిత ప్రసవాలను నమోదు చేసిన సీహెచ్‌సీగా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. ఈ విజయానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ కేవీఎన్.చక్రధర్‌బాబు (ఐఏఎస్) సీహెచ్‌సీ వైద్యులు, సిబ్బందిని అభినందించారు. ఈ మేరకు అధికారిక ప్రశంసా పత్రాన్ని సీహెచ్‌సీకి పంపించారు. గిరిజన ప్రాంతాల్లోని గర్భిణిలకు సురక్షితమైన మాతృత్వాన్ని అందించడంలో ఇక్కడి వైద్యులు, సిబ్బంది చూపిన నైపుణ్యం, నిబద్ధతను ఆయన అభినందించారు. అలాగే మాతృ మరణాల రేటును తగ్గించడంలో, గ్రామీణ ఆరోగ్య ప్రమాణాలను పెంచడంలో ముంచంగిపుట్టు వైద్య సిబ్బంది పోషించిన పాత్రను కొనియాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇతర ప్రభుత్వ ఆసుపత్రులకు ముంచంగిపుట్టు సీహెచ్‌సీ రోల్ మోడల్‌గా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో తమ ఆసుపత్రికి మొదటి స్థానం దక్కడం, ప్రభుత్వం నుంచి ప్రత్యేక అభినందనలు రావడం పట్ల వైద్యులు, సిబ్బంది, స్థానికులు, గిరిజన సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# చాపరాయిలో గిరిజనుడి మృతి

**డుంబ్రిగుడ, పతాకం న్యూస్:** డుంబ్రిగుడ పర్యాటక కేంద్రం చాపరాయి జలవిహారి సమీపంలోని హనుమరాయి గెడ్డలో సరదాగా స్నానానికి దిగి గిరిజనుడు మృతి చెందాడు. బాధిత గిరిజనుడి కుటుంబీకులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పోతంగి పంచాయతీ అంత్రిగుడ గ్రామానికి చెందిన కొర్రా సోంబ్రు (42) అనే గిరిజనుడి స్థానిక మండల కేంద్రంలోని ఓ చికెన్ దుకాణంలో రోజు వారి కూలిగా పనిచేస్తున్నాడు. దుకాణంలో పనిచేసిన ఆయన శుక్రవారం మధ్యాహ్నం స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యలోని చాపరాయి గెడ్డకు ఆనుకుని ఉన్న హనుమరాయిలో స్నానం చేసేందుకు దిగడాన్ని జలవిహారిలో పనిచేస్తున్న సిబ్బంది గమనించారు. సిబ్బంది వారించేలోపు ఆయన హఠాత్తుగా జారిపడి గెడ్డలో గల్లంతయ్యారు. జలవిహారి సిబ్బందితోపాటు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. స్థానిక ఈతగాళ్లతోపాటు ఎన్డీఆర్‌ఎఫ్ బృందం గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని వెలికి తీశారు. సంఘటన స్థలంలో బాధిత గిరిజనుడి కుటుంబీకులు మృతదేహాన్ని చూసి భోరుమన్నారు.

# విజయవంతం చేద్దాం: లోకేశ్
## (మొదటిపేజీ తరువాయి)

సభ్యులందరినీ మహానాడుకు ప్రత్యేకంగా ఆహ్వానించి, వారందరూ పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు. పొదుపు చర్యల్లో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు ఈసారి హైబ్రిడ్ పద్ధతుల్లో మహానాడును నిర్వహించాలని టీడీపీ నిర్ణయించింది. మంగళగిరి టీడీపీ ప్రధాన కార్యాలయంలో అతితక్కువ మందితో మహానాడును నిర్వహించనున్నారు. ఈ నెల 27, 28వ తేదీల్లో జరగనున్న మహానాడులో సుమారు 20 తీర్మానాలను ప్రవేశపెట్టనున్నారు. మహానాడు-2026ను స్త్రీ శక్తి థీమ్‌తో నిర్వహించాలని టీడీపీ పొలిట్ బ్యూరో నిర్ణయించింది.

## ఎల్‌నినోను ఎదుర్కొనేలా చర్యలు తీసుకోవాలి




**పార్వతీపురం, పతాకం న్యూస్:** ఎల్‌నినో ముప్పు ఎదుర్కొనేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. జిల్లాస్థాయి ఎల్‌నినో ఉపశమన చర్యల ప్రణాళిక బుక్‌లెట్‌ను కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. వాతావరణ మార్పులు, తీవ్ర ఎండలు, వర్షాభావం వంటి పరిస్థితులు, ప్రకృతి వ్యవసాయ విధానాలపై రైతులకు అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ బుక్‌లెట్‌ను రూపొందించినట్టు కలెక్టర్ వెల్లడించారు. నేలలో తేమను కాపాడే విధానం, ముందస్తు పొడి విత్తన విధానం వంటి వాటిపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. రైతు సేవా కేంద్రాల సమన్వయంతో క్షే త్రస్థాయి సిబ్బంది, వ్యవసాయాధికారులు , డిజిటల్ ప్లాట్‌ఫారాల ద్వారా రైతులకు సమయానుకూల శాస్త్రీయ సలహాలు అందించాలని సూచించారు. ఈ ప్రణాళికను విజయవంతం అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో శతశాతం మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ముందుగా జిల్లాలో మరుగుదొడ్ల నిర్మాణాలు తదితర అంశాలపై నవ్యాంధ్ర కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అర్జునరావు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 13,731 మరుగుదొడ్ల నిర్మాణాలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలన్నారు. దీని కోసం 16.47 కోట్లు కేటాయించినట్టు వివరించారు. ఈ సమావేశంలో డీఆర్వో హేమలత పాల్గొన్నారు. జిల్లాలో మరో ఐదు రోజుల పాటు అధికస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. వాతావరణ శాఖ విడుదల చేసిన నివేదిక ప్రకారం.. జిల్లాలోని 15 మండలాలు డేంజర్ కేటగిరీలో ఉన్నాయన్నారు. 41 నుంచి 54 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## సూర్యఘర్ పరికరాల రికవరీ



**సాలూరు, పతాకం న్యూస్:** కొఠియా వివాదాస్పద 21 గ్రామాల్లో ఒకటైన గంజాయిభద్ర పంచాయతీ ఎగువసెంబి నుంచి ఒడిశా అధికారుల తీసు కెళ్లిన సూర్యఘర్ సామగ్రిని ఆంధ్రా పోలీసులు రికవరీ చేశారు. ఎగువసెంబిలో ఆరుగురు లబ్ధి దారులకు స్థానిక అధికారులు సూర్యఘర్ పరికరాలను అందజేశారు. విషయం గ్రహించిన ఒడిశా బీడీవో, అక్కడ పోలీసుల నాలుగిళ్ల ఎదుట ఉంచిన సూర్యఘర్ పరికరాలను తీసుకెళ్లారు. ఈ విషయాన్ని తెలుసుకున్న గిరిజనులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఉద యం కొఠియా సీఐ క్రాంతికుమార్, సాలూరు రూరల్ సీఐ పి.రామకృష్ణ, సాలూరు రూరల్ ఎస్ఐ రవీంద్ర రాజు.. ఒడిశాకు సంబంధించిన కొఠి యా పోలీసుస్టేషన్‌కు వెళ్లి సూర్యఘర్ పరికరాలను రికవరీ చేసి గిరిజనులకు అందజేశారు.

## భవిష్యత్‌లో యుద్ధాలు కేవల సరిహద్దుకే పరిమితం కావు: జనరల్ అనిల్ చౌహాన్



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** భవిష్యత్ యుద్ధాలు సంప్రదాయ పద్ధతులకు భిన్నంగా మల్టీ–డొమైన్ విధానంలో జరుగుతాయని భారత సాయుధ దళాల చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ వ్యాఖ్యానించారు. భూభాగం, సముద్రం, గగనం మాత్రమే కాకుండా సైబర్, కాగ్నిటివ్ వార్‌ఫేర్ వంటి రంగాలు కూడా యుద్ధాల్లో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఆధునిక యుద్ధాలు ఇకపై కేవలం సైనిక బలం, సంప్రదాయ ఆయుధాలు లేదా ప్లాట్‌ఫామ్ ఆధారిత ఆపరేషన్లతో మాత్రమే పరిమితం కావని స్పష్టం చేశారు. మహారాష్ట్రలోని అహిల్యానగర్ జిల్లాలో ఒక రక్షణ తయారీ యూనిట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న జనరల్ అనిల్ చౌహాన్ ఈమేరకు వ్యాఖ్యానించారు. కృత్రిమ మేధ (ఏఐ), డ్రోన్లు, రోబోటిక్స్, సైబర్ సిస్టమ్స్, ఆటోనమస్ ప్లాట్‌ఫామ్స్, అంతరిక్ష సాంకేతికతలు భవిష్యత్ యుద్ధాలకు నిర్ణయాత్మక రూపం ఇస్తాయని తెలిపారు. రానున్న రోజుల్లో సాంకేతికత, వేగం, ఆవిష్కరణలే విజయవంతమైన సైనిక ఆపరేషన్లను నిర్ణయిస్తాయని సీడీఎస్ తెలిపారు. భవిష్యత్‌లో యుద్ధభూములు కేవలం భౌగోళిక ప్రాంతాలకు మాత్రమే పరిమితం కావని, సమాచార నెట్‌వర్క్‌లు, డిజిటల్ ఎకోసిస్టమ్‌లు, సైబర్ మౌలిక వసతులు కూడా యుద్ధరంగాలుగా మారతాయని ఆయన హెచ్చరించారు. ఏ దేశం వేగంగా సాంకేతిక ఆవిష్కరణలు చేస్తుందో, రక్షణ ఉత్పత్తిని త్వరగా పెంచుతుందో, అలాగే తమ సాయుధ దళాలను కొత్త పరిస్థితులకు వేగంగా అనుగుణంగా మార్చుకుంటుందో ఆ దేశానికే వ్యూహాత్మక ఆధిక్యం లభిస్తుందని జనరల్ చౌహాన్ అన్నారు.

# ఉపాధి వేతన బకాయిలు తక్షణమే విడుదల చేయాలి



**తాడేపల్లిగూడెం, పతాకం న్యూస్:** ఉపాధి వేతన బకాయిలు తక్షణమే విడుదల చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాది హామీ పనుల పర్యటనలో భాగంగా శనివారం ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు తాడేపల్లిగూడెం మండలం నందమూరి గ్రామంలో పర్యటించారు. ఉపాధి పని ప్రదేశంలో కూలీలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 48 డిగ్రీల ఎండలో కనీసం మంచినీళ్లు మజ్జిగ సౌకర్యాలు లేక ఉపాధి కూలీలు అనేక అగచాట్లు పడుతున్నారని, ఎండ వేడి తాళలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అవసరమైతే గ్రామపంచాయతీ బాధ్యత తీసుకుని మజ్జిగ మంచినీళ్లు సదుపాయం ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీరాములవెంకట రామారావు, మెరిపే పండు, గద్దం బ్రహ్మానందం, నాగయ్య, జి.ముత్యాలమ్మ, దిరు సుమద్రు నాగరత్నం, టి. కళావతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి సమస్యనూ పరిష్కరిస్తాం




**బొబ్బిలి, పతాకం న్యూస్:** ప్రజా ఫిర్యాదుల్లో ప్రతి సమస్యనూ పరిష్కరిస్తామని ఎమ్మెల్యే బేబీనాయన హామీ ఇచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిలో పీజీఆర్‌ఎస్ ను నిర్వహింయారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని 152 అర్జీలను స్వీకరించారు. సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడారు. వాటి పరిష్కారానికి హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం చంద్ర బాబు ఆదేశాల మేరకు నియోజకవర్గ పరిధిలోని సమస్యలను పరిష్కరించేందుకు కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీను, ఎంపీడీవో రవికుమార్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం గజపతినగరం ప్రభుత్వ బాలికల పాఠశాలకు చెందిన విదార్థినులు టెన్త్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన నేపథ్యంలో వారిని ఎమ్మెల్యే సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, ఎంఈవో రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నెలాఖరులోగా జనగణన పూర్తి చేయాలి



**విజయనగరం, పతాకం న్యూస్:** ఈనెలాఖరులోగా జనగణన ప్రక్రియను వందశాతం పూర్తి చేయాలని, దీనిలో ఎలాంటి అలసత్వానికి తావుండకూడదని ఇన్‌చార్జి కలెక్టర్ సేతుమాధవన్ ఆదేశించారు. తన చాంబర్‌లో ఆయా శాఖ అధికారులుతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్ణీత గడువులోగా జనగణనను ముగించడానికి అధికారులు ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా క్షేత్రస్థాయి పరిశీలన సమయంలో తాళం వేసి ఉన్న ఇళ్లపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఆయా ఇళ్లను మరోసారి సందర్శించి అక్కడ నివశించే వారి వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. తాత్కాలికంగా వలస వెళ్లిన వారిని కూడా గుర్తించి వివరాలను నమోదు చేయాలన్నారు. అలాగే విద్యా సంస్థలు, కోచింగ్ సెంటర్లు, హాస్టళ్లు, అనాథ శరణాలయాలు, ఆశ్రమాలు తదితర చోట్లకు వెళ్లి వివరాలు సేకరించాలన్నారు. ప్రతి ఇళ్లు, ప్రతి ఒక్క వ్యక్తి వివరాలను నమోదు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌వో చందక సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్, డీజిల్ ధరలను పెంచి మోదీ ప్రభుత్వం దోచుకుంటోంది: మల్లికార్జున్ ఖర్గే



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను మరోసారి పెంచడంపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఎనిమిది రోజుల వ్యవధిలోనే మూడు సార్లు ధరలు పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధిక ధరలతో దేశ ప్రజలను బీజేపీ ప్రభుత్వం దోచుకుంటోందని ఆరోపించారు. పెట్రోల్, డీజిల్‌పై రోజువారీగా రూ.1,000 కోట్ల పన్నులను కేంద్రం విధిస్తోందని.. అయినా మోదీ ప్రభుత్వానికి అత్యాశ తీరలేదని ఖర్గే విమర్శించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు తక్కువగా ఉన్నప్పటికీ.. ఆ ప్రయోజనాలను దేశ ప్రజలకు అందించలేదని ఖర్గే నిప్పులు చెరిగారు. ఇది ప్రజలను నిర్దాక్షిణ్యంగా దోచుకోవడమేనని మండిపడ్డారు. సంక్షోభం వచ్చినప్పుడు ఎన్నికల ప్రచారంలో బీజేపీ మునిగిపోయిందని, ఆ తర్వాత ఇప్పుడు త్యాగం గొప్పతనం గురించి చెబుతోందని ఆయన విమర్శించారు. ఇతర దేశాలతో పోలిస్తే భారతదేశంలో ఇంధన ధరలు అత్యంత తక్కువగా ఉన్నాయని కమలం పార్టీ నేతలు చెబుతున్నారని ఖర్గే ఆగ్రహించారు. పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమైన తర్వాత అంతా బాగానే ఉందని భారతీయులకు ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారని అన్నారు. కానీ అదే సమయంలో ఇతర దేశాలు తమ పౌరులకు చురుకుగా సహాయాన్ని అందించాయని మల్లికార్జున్ ఖర్గే పేర్కొన్నారు.

### ఇంకా కొనసాగుతున్న

# గ్యాస్ కష్టాలు




**శృంగవరపుకోట, పతాకం న్యూస్:** జిల్లాలో గ్యాస్ కష్టాలు ఇంకా కొనసాగుతున్నాయి. గ్యాస్ ఏజెన్సీల వద్ద వందలాది మంది వినియోగదారులు సిలిండర్ల కోసం గంటల తరబడి క్యూలైన్లలో నిలబడాల్సి వస్తోంది. పనులు మానుకొని తెల్లవారుజామున నుంచే గోడౌన్‌ల వద్ద క్యూ కట్టేస్తున్నారు. సిలిండర్లను డోర్ డెలివరీ చేస్తామని ఏజెన్సీల నిర్వాహకులు చెబుతున్నా వారు వినడం లేదు. బుక్ చేసి పదిహేను రోజులు దాటిందని, సిలిండర్ ఇవ్వాలని పట్టుబడుతున్నారు. సిలిండర్ చేతికి అందేవరకూ కదలడం లేదు. అమెరికా–ఇరాన్ యుద్ధం మొదలైన నాటి నుంచి ఈ కష్టాలు ఎక్కువయ్యాయి. గ్యాస్ కొరత లేదని ప్రజాప్రతినిధులు, అధికారులు చెబుతున్నప్పటికీ ఏజెన్సీలు మాత్రం డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా చేయలేకపోతున్నాయి. సిలిండర్‌ను బుక్ చేసిన తరువాత వినియోగదారుడు నెలరోజుల పాటు అడగకుంటే ఇక దాని గురించి మరిచిపోవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. ఆ సిలిండర్‌ను వేరేకొరికి ఇచ్చేశామని, డెలివరీ జరిగిపోయిందంటూ ఏజెన్సీలు చెబుతున్నాయని వినియోగదారులు వాపోతున్నారు. అందుకే బుక్ చేసిన పదహారు రోజు నుంచే వినియోగదారులు ఏజెన్సీల వెంట పడుతున్నారు. అయితే, సిలిండర్లను డెలివరీ చేసేలోపే వినియోగదారులు ఏజెన్సీల వద్దకు వచ్చేస్తున్నారని నిర్వాహకులు అంటున్నారు. కొంతమంది ఏజెన్సీల నిర్వాహకులు బ్లాక్‌లో సిలిండర్లను విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. టీ, టిఫిన్ దుకాణాలకు, హోటళ్లకు తెరచాటున సిలిండర్లను పంపిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఏ దుకాణంలో చూసినా వాణిజ్య సిలిండర్లకు బదులు గృహ వినియోగ సిలిండర్లు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం జిల్లాలో చాలా గ్రామాల్లో గ్రామ దేవతల పండగలు జరుగుతున్నాయి. బంధు, మిత్రులకు విందు భోజనాలు పెడుతున్నారు. దీంతో మరింత గ్యాస్ అవసరం పెరిగింది. పరపతి కలిగిన కుటుంబాలకు గ్యాస్ సిలిండర్‌లు అందుతున్నాయి. మిగతా వారికి సిలిండర్లు దొరకకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అవసరాలకు సరిపడ గ్యాస్ సరఫరా జరిగేలా జిల్లా పౌరసరఫరాల శాఖ చర్యలు చేపట్టాలని వినియోగదారులు కోరుతున్నారు.

## ఏఐ కాప్ రైటర్ యాప్‌ను ఆవిష్కరించిన సజ్జనార్



**హైదరాబాద్, పతాకం న్యూస్:** పోలీసింగ్ వ్యవస్థలో అత్యాధునిక సాంకేతికతను జోడిస్తూ 'హైదరాబాద్ నగర పోలీస్' మరో చారిత్రాత్మక ముందడుగు వేసింది. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు భాషాపరమైన ఇబ్బందులు కలగకుండా, వారి ఫిర్యాదులను త్వరితగతిన, కచ్చితత్వంతో నమోదు చేసేందుకు దేశంలోనే తొలిసారిగా 'ఏఐ కాప్‌రైటర్' అనే కృత్రిమ మేధ ఆధారిత మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ ఏఐ కాప్‌రైటర్ యాప్‌ను హైదరాబాద్ సీపీ సజ్జనార్ ఆవిష్కరించారు. అనంతరం దాని పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దీని ద్వారా 10కి పైగా భాషల్లో ఫిర్యాదులు నమోదు చేసే అవకాశం ఉందని అన్నారు. చెప్పిన విషయాలను వెంటనే టెక్స్ట్‌గా మార్చి అనువదించవచ్చని చెప్పారు. ఫిర్యాదు వివరాలు ఆటోమేటిక్‌గా పీడీఎఫ్ రూపంలో సేవ్ అయ్యే సదుపాయం ఉందని తెలిపారు. వలస కార్మికులు, పర్యాటకులు, మహిళలు, వృద్ధులకు పెద్ద ఊరట లభిస్తుందని చెప్పారు. న్యాయానికి భాష అడ్డంకిగా ఉండకూడదన్న లక్ష్యంతో ఏఐ వినియోగిస్తున్నట్లు చెప్పారు. మొదట హైదరాబాద్ పరిధిలోని 80కి పైగా పోలీస్ స్టేషన్‌లలో ఈ యాప్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు చెప్పారు. ఎఫ్ఐఆర్ ప్రక్రియను వేగంగా, కచ్చితత్వంతో పూర్తి చేసేందుకు ఈ యాప్ దోహదపడుతుందని సజ్జనార్ పేర్కొన్నారు. బ్లూక్లౌడ్ సొల్యూషన్స్ సహకారంతో యాప్ రూపకల్పన చేసినట్లు చెప్పారు.

### తెలంగాణలో భానుడి ఉగ్రరూపం..

## వడదెబ్బతో 34 మంది మృతి



**అమరావతి, పతాకం న్యూస్:** తెలంగాణ రాష్ట్రం భానుడి భగభగలతో అగ్నిగుండంలా మారుతోంది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో నిప్పుల వర్షం కురుస్తుండగా, రాష్ట్రవ్యాప్తంగా ఎండల తీవ్రత, వడగాలులతో ప్రజలు అల్లాడిపోతున్నారు. పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతూ, రాష్ట్రంలో ఇప్పటివరకు వడదెబ్బ కారణంగా 34 మంది ప్రాణాలు కోల్పోయారు. వాతావరణ శాఖ రాష్ట్రంలోని 18 జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేయడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. పగటిపూట బయటకు రావాలంటేనే ప్రజలు భయపడి ఇళ్లకే పరిమితమవుతున్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి)లో 46.5 డిగ్రీల రికార్డు స్థాయి ఉష్ణోగ్రత నమోదైంది. జగిత్యాల, కరీంనగర్, మంచిర్యాల, నిజామాబాద్, సూర్యాపేట సహా పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 46.4 డిగ్రీలుగా రికార్డయ్యాయి. మొత్తంగా రాష్ట్రంలోని 16 జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు 46.2 నుంచి 46.5 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. నిన్న ఒక్కరోజే 244 మండలాల్లో తీవ్రమైన ఎండల ప్రభావం కనిపించింది. సూర్యాపేట జిల్లాలోని 22 మండలాల్లో, మంచిర్యాల, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాల్లో 18 చొప్పున మండలాల్లో వడగాలులు వీచాయి. సాధారణంగా సూర్యాస్తమయం తర్వాత వాతావరణం చల్లబడుతుంది. కానీ, గాలిలో తేమ శాతం పూర్తిగా పడిపోవడంతో రాత్రిపూట కూడా వేడి సెగలు, ఉక్కపోత తగ్గడం లేదు. గురువారం రాత్రి హైదరాబాద్, హకీంపేట, ఆదిలాబాద్, నిజామాబాద్ వంటి ప్రధాన నగరాల్లో సాధారణం కంటే 2.7 నుంచి 4.7 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో ప్రజలు రాత్రుళ్లు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రానున్న నాలుగు రోజుల పాటు ఎండల తీవ్రత ఇలాగే కొనసాగుతుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ), విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరించాయి. ఈనెల 26 వరకు పలు జిల్లాల్లో వడగాలులు వీస్తాయని పేర్కొన్నాయి. ముఖ్యంగా ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్ జిల్లాల ప్రజలు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రావద్దని వైద్య ఆరోగ్య శాఖ సూచించింది. వృద్ధులు, గర్భిణీలు, చిన్న పిల్లల విషయంలో అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని, నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ప్రమాదమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## పైప్డ్ నేచురల్ గ్యాస్‌పై విస్తృత ప్రచారం: మంత్రి నాదెండ్ల



**అమరావతి, పతాకం న్యూస్:** వంటగ్యాస్ కోసం వినియోగిస్తున్న ఎల్పీజీ సిలిండర్లకు ప్రత్యామ్నాయంగా పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్‌జీ) వైపునకు వినియోగదారులను మార్చే ప్రక్రియను వేగవంతం చేయాలని పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ వివిధ శాఖల ఉన్నతాధికారులను ఆదేశించారు. దీనిపై గ్యాస్ కంపెనీలు ప్రజలకు పూర్తి అవగాహన కల్పించే దిశగా విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. అన్ని జిల్లాల్లో ప్రచార జాతాలు నిర్వహించాలని కోరారు. రాష్ట్ర సచివాలయంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు, పీఎన్‌జీ గ్యాస్ కంపెనీల ప్రతినిధులతో మంత్రి సమీక్షించారు. రవాణా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. మనోహర్ మాట్లాడుతూ.. అన్నదానం జరిగే పెద్ద ఆలయాల్లో తప్పనిసరిగా పీఎన్‌జీనే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దుర్గ గుడి, శ్రీకాళహస్తి ఆలయాల్లో ఎదురవుతున్న చిన్న సమస్యలను త్వరగా పరిష్కరించాలని దేవదాయ కమిషనర్‌ను ఆదేశించారు. నగరాలు, పట్టణాల్లో గ్రూప్ హౌస్‌లు, అపార్ట్‌మెంట్లు, విల్లాలు, ప్రత్యేక గృహ సముదాయాలకు పైప్డ్ గ్యాస్ సరఫరాను విస్తరించేందుకు కంపెనీలు కార్యాచరణ అమలు చేయాలని సూచించారు. పీఎన్‌జీ గ్యాస్ విస్తరణలో యువతను భాగస్వామ్యం చేయాలన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రతి జిల్లా నుంచి 15 రోజులకొక బ్యాచ్‌లో 100 మందిని తీసుకుని శిక్షణ అందించాలన్నారు. డ్వాక్రా మహిళల ద్వారా పీఎన్‌జీ ఉపయోగాలను వివరించేలా అధికారులు ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించాలని కోరారు.

## ప్రభుత్వ విప్ పదవికి జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ రాజీనామా



**అమరావతి, పతాకం న్యూస్:** రైల్వే కోడూరు జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ విప్ పదవికి అరవ శ్రీధర్ రాజీనామా చేశారు. ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మీద ఇటీవలి కాలంలో పలు ఆరోపణలు వచ్చాయి. ముఖ్యంగా ఓ వివాహిత మహిళ అరవ శ్రీధర్ మీద చేసిన ఆరోపణలు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపాయి. దీనిపై జనసేన విచారణ కమిటీని ఏర్పాటు చేయగా.. అరవ శ్రీధర్ తన వివరణ కూడా తెలియజేశారు. అయితే ఆ తర్వాత కూడా బాధితురాలు మరిన్ని వీడియోలు విడుదల చేయటం.. వివిధ అంశాలలో అరవ శ్రీధర్ మీద ఆరోపణలు రావటంతో ఆయన ప్రభుత్వ విప్ పదవికి రాజీనామా చేసినట్లు సమాచారం. ఈ మేరకు డిప్యూటీ సిఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు తన రాజీనామా లేఖను సమర్పించారు. మరోవైపు రైల్వేకోడూరు జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ , పోలవరం ఎమ్మెల్మే చిర్రి బాలరాజుతో పవన్ కళ్యాణ్ శనివారం సమావేశమైనట్లు తెలిసింది. ఈ సందర్భంగా తమపై వస్తున్న ఆరోపణలపై ఇద్దరు ఎమ్మెల్యేలు తమ వివరణ వినిపించినట్లు సమాచారం. ఈ క్రమంలోనే శాసన సభలో విప్‌గా ఉన్న అరవ శ్రీధర్ తన విప్ పదవికి రాజీనామా పత్రాన్ని అందచేశారు. వ్యక్తిగత కారణాలతో విప్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు అరవ శ్రీధర్ తెలిపారు.

# వేగంగా విస్తరిస్తున్న కాంగోలో ఎబోలా వైరస్




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఆఫ్రికా దేశమైన కాంగోలో ఎబోలా వ్యాప్తిపై ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) చీఫ్ టెడ్రోస్ అధనోమ్ కీలక ప్రకటన చేశారు. కాంగోలా ఎబోలా వైరస్ వేగంగా విస్తరిస్తోందని తెలిపారు. కాంగోలో ఎబోలా వైరస్ ప్రమాద అంచనాను హై నుంచి వెరీ హైకు సవరిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రాంతీయంగా ఈ వైరస్ వ్యాప్తి చెందే అవకాశం అధికంగానే ఉందని, ప్రపంచ స్థాయిలో మాత్రం తక్కువగానే ఉందని అన్నారు. ప్రస్తుతం కాంగోలో దాదాపు 750 ఎబోలా అనుమానిత కేసులు ఉన్నాయని డబ్ల్యూహెచ్ఓ చీఫ్ టెడ్రోస్ అధనోమ్ తెలిపారు. ఈ వైరస్ కారణంగా 177 మంది ప్రాణాలు విడిచారని పేర్కొన్నారు. కాంగోలో ఎబోలా వ్యాప్తి తీవ్ర ఆందోళనకరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ధ్రువీకరించిన గణాంకాల కంటే ఈ మహమ్మారి తీవ్రత చాలా ఎక్కువగా ఉండే అవకాశం ఉందని హెచ్చరించారు. కాంగో పొరుగు దేశమైన ఉగాండాలో పరిస్థితి స్థిరంగా ఉందన్నారు. అక్కడ ఈ వ్యాధితో ఒకరు మరణించారని వెల్లడించారు. మరో రెండు కేసులు నిర్ధరణ అయ్యాయని స్పష్టం చేశారు.

కాంగోలో పనిచేస్తున్న ఒక అమెరికన్ జాతీయుడికి ఎబోలా పాజిటివ్ అని తేలడంతో, అతడిని చికిత్స కోసం జర్మనీకి తరలించారని డబ్ల్యూహెచ్ఓ చీఫ్ టెడ్రోస్ అధనోమ్ చెప్పారు. అలాగే అధిక ప్రమాదం ఉన్న కాంటాక్ట్‌గా గుర్తించిన మరో అమెరికన్‌ను చెక్ రిపబ్లిక్‌కు తరలించినట్లు సమాచారం అందిందని వివరించారు. నిరంతర పర్యవేక్షణ, టెస్టులు పెంచడంతో వైరస్ గణాంకాలు మారుతూనే ఉన్నాయని అన్నారు. కానీ హింస, అభద్రత సహాయక చర్యలకు ఆటంకం కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎబోలా వైరస్ వ్యాప్తికి కేంద్ర బిందువైన ఇటూరి ప్రావిన్స్‌కు, అక్కడి బాధితులకు అందే సహాయక చర్యలను సమన్వయం చేయడానికి అదనంగా మరికొంత మంది డబ్ల్యూహెచ్ఓ సిబ్బందిని పంపినట్లు తెలిపారు.

ఆఫ్రికా దేశాలైన కాంగో, ఉగాండాలో ఎబోలా వైరస్ ఉద్ధృతి కొనసాగుతోంది. దీంతో డబ్ల్యూహెచ్ఓ ఆరోగ్య అత్యవసర స్థితిని ప్రకటించిన నేపథ్యంలో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ అప్రమత్తమైంది. నిఘా, ఆస్పత్రుల సన్నద్ధత, అంతర్జాతీయ ప్రయాణికుల స్క్రీనింగ్‌ను ముమ్మరం చేయాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఆదేశించింది. ఈ మేరకు ఆయా రాష్ట్రాలు, యూటీలకు కేంద్ర ఆరోగ్య కార్యదర్శి పుణ్య సలీల శ్రీవాస్తవ లేఖ రాశారు. దక్షిణ సూడాన్‌తో సహా కాంగో, ఉగాండా సరిహద్దు దేశాల్లో ఎబోలా వైరస్ వ్యాప్తి చెందే ప్రమాదం ఎక్కువగా ఉన్నట్లు అంచనా వేసినట్లు లేఖలో పేర్కొన్నారు.

"ప్రస్తుత అంచనా ప్రకారం ఆఫ్రికా ప్రాంతం వెలుపల ఉన్న దేశాలకు ఎబోలా వైరస్ ముప్పు తక్కువగా ఉంది. అయినప్పటికి భారీ స్థాయిలో జరుగుతున్న అంతర్జాతీయ వాణిజ్యం, ప్రయాణాలు ఆరోగ్య వ్యవస్థలోని అన్ని స్థాయిల్లో తగిన సన్నద్ధత, ప్రతిస్పందన సామర్థ్యాలను కొనసాగించాల్సిన ప్రాముఖ్యతను నొక్కి చెబుతున్నాయి. ఎబోలా ప్రభావిత ప్రాంతాల నుంచి వైరస్ లక్షణాలతో వచ్చిన వారి ప్రయాణ చరిత్రపై నిఘా పెట్టాలి. జ్వరం, నీరసం, కండరాల నొప్పి, తలనొప్పి, గొంతు నొప్పి, వాంతులు, విరేచనాలు, కడుపు నొప్పి, దద్దుర్లు వంటివి ఎబోలా వైరస్ లక్షణాలు. ఐసోలేషన్ సౌకర్యాలు, ప్రత్యేక అంబులెన్స్‌లు, శిక్షణ పొందిన ఆరోగ్య సంరక్షణ సిబ్బంది, పీపీఈ కిట్లు, లాజిస్టిక్స్, ప్రయోగశాలలు, క్రిటికల్ కేర్ సామర్థ్యాల లభ్యతను నిర్ధారించుకోవాలి. ఎబోలా అనుమానిత కేసుల నమూనాలను పరీక్షించడానికి పుణెలోని ఐసీఎంఆర్ జాతీయ వైరాలజీ సంస్థ పూర్తి సదుపాయాలతో ఉంది. రాష్ట్రాలు, యూటీలు ప్రస్తుతం ఉన్న సన్నద్ధతా ప్రణాళికలను తక్షణమే సమీక్షించుకోవాలి. అలాగే ఆందోళన కలిగించే ఏవైనా ప్రజారోగ్య సంఘటనలను సకాలంలో గుర్తించి, స్పందించడానికి తగిన యంత్రాంగాన్ని అందుబాటులో ఉండేలా చూసుకోవాలి" అని పుణ్య సలీల శ్రీవాస్తవ లేఖలో తెలిపారు.

# కొత్త అపార్టుమెంట్లకు భారీగా పెరగనున్న విద్యుత్ కనెక్షన్ల ఖర్చు



**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్రంలో ఇక నుంచి అపార్ట్‌మెంట్‌లో కొత్తగా ఫ్లాట్ తీసుకోవాలన్నా, చిన్న పరిశ్రమలను విస్తరణ చేయాలన్నా, నగర, గ్రామ శివార్లలో కొత్తగా ఇళ్లు నిర్మించాలనుకుంటున్న విద్యుత్ వినియోగదారులపై కొత్త భారం పడనుంది. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపిఇఆర్ సి) తీసుకొచ్చిన నిబంధనల వల్ల వినియోగదారులకు ఇప్పటి వరకు అయ్యే ఖర్చుకు ఇక నుంచి రెండింతలు కానుంది. బహుళ అంతస్తుల భవనాల్లో సర్వీస్ కనెక్షన్ ఖర్చులపై స్పష్టత ఇవ్వాలని ఎపిసిపిడిసిఎల్, ఎపిఇపిడిసిఎల్,ఎపిఎస్పిడిసిఎల్ సంస్థలు ఇటీవల ఎపిఇఆర్‌సికి లేఖలు రాశాయి. వీటిపై స్పష్టత ఇవ్వడంతో పాటు వినియోగదారులపై భారాలు మోపేలా 2013నాటి రెగ్యులేషన్-4కు చేసిన సవరణకు మరోసారి సవరణ చేస్తూ ఐదో సవరణ కింద ముసాయిదా నిబంధనలను ఎపిఇఆర్ సి ఇటీవల విడుదల చేసింది. ఈ నిబంధనలపై ఈ నెల 26వ తేదిలోపు అభ్యంతరాలు, సలహాలు ఇవ్వాలని ఎపిఇఆర్ సి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నిబంధనల ప్రకారం కొత్తగా అపార్ట్ మెంట్లలో ఫ్లాట్లు కొనాలన్నా, నగర, గ్రామ శివార్లలో కొత్తగా ఇల్లు నిర్మించాలన్నా అదనపు రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటివరకు అపార్ట్ మెంట్ లోని ఫ్లాట్లకు కనెక్షన్ బిల్డర్ కనెక్షన్ తీసుకోవాలంటే అన్ని ఫ్లాట్లకు కలిపి కనెక్టెడ్ లోడ్ కలిపి ఫిక్స్ డ్ సర్వీస్ చార్జీ లేదా అంచనా వ్యయాలలో ఒకదానిని ఎంచుకునే విధానం ఉంది. ఇప్పుడు 150కెవి దాటితే అంచనా వ్యయం ఆధారంగానే కనెక్షన్ ఇవ్వాలని ముసాయిదాలో ఎపిఇఆర్ సి పొందుపరిచింది. దీనివల్ల పాత విధానం ప్రకారం సుమారు రూ.20లక్షలు అయ్యే ఖర్చు కొత్త విధానం ప్రకారం సుమారు రూ.45లక్షల వరకు అవుతుందని చెబుతున్నారు. అదనంగా పడే భారాన్ని బిల్డర్ ఫ్లాట్లు కొనే వినియోగదారులపైనే మోపుతాడు తప్ప సొంతగా ఖర్చు చేయని పరిస్థితి ఉంటుంది. దీంతో వినియోగదారులపైనే ఆ భారం పడుతుంది. అదేవిధంగా 15కెవి తో చిన్న రైస్ మిల్లును నడుపుకుంటున్న చిరు వ్యాపారి దాని విస్తరించాలన్నా భారం పడక తప్పని స్తితి ఏర్పడింది. ఇప్పటి వరకు ఉన్న విధానం ప్రకారం కిలోవాట్ కు రూ.2400చొప్పున చెల్లించే విధానం ఉంది. అయితే 25కెవికి కనెక్షన్ కావాలంటే దానికి సరిపడ డబ్బును ఒకేసారి చెల్లించాల్సి ఉంటుంది. దీనివల్ల చిరువ్యాపారికి అదనంగా సుమారు రూ.2లక్షల వరకు భారం పడే అవకాశం ఉంది. నగరు శివారులో ఉన్న కొత్తగా ఇల్లు కట్టుకునే వినియోగదారుడికి రూరల్ ఎలక్ట్రిఫికేషన్ పథకం కింద డిస్కం 50శాతం ఖర్చు భరించేది. కొత్త విధానం వల్ల కిలో మీటర్ దాటిన తరువాత 300 మీటర్లకు అయ్యే ప్రతి ఖర్చును వినియోగదారుడే భరించాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు రూ.50వేల లోపు అయ్యే ఖర్చు ఇక నుంచి సుమారు రూ.1.50లక్షలకు పెరగనుంది. కొత్తగా తీసుకొచ్చిన నిబంధన వల్ల ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద పేదవాళ్లు నిర్మించే ఇళ్లపై కూడా పడే అవకాశం ఉంటుంది.

# తాడేపల్లిగూడెంలో విమానాశ్రయం ఏర్పాటుపై ఆశలు



**తాడేపల్లిగూడెం, పతాకం న్యూస్:** తాడేపల్లిగూడెంలో విమానాశ్రయం ఏర్పా టుపై ప్రజలతో పాటు ప్రజా ప్రతినిధులు ఆశతో ఎదురు చూస్తున్నారు. వాణిజ్య, విద్యా కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న పట్టణంలో విమానాశ్రయం ఏర్పాటైతే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని చెబుతున్నారు. రూరల్ మండలంలోని వెంకట్రామన్నగూడెం, జగ్గన్నపేటలో విమానాశ్రయం కోసం ప్రతిపాదించిన 1,123 ఎకరాల భూమిని కేంద్ర బృందం పరిశీలించిన విషయం తెలిసిందే. ఇక్కడ భూములు అనుకూలంగా ఉన్నట్టు గుర్తించారు. అయితే ఐదు కిలీమీటర్ల రన్‌వే ఉండాలంటూ కేంద్ర బృందం ప్రతిపాదించింది. దానికోసం అధికంగా భూములుండాలి. టెర్మినల్, ఇతర అవసరాలకు భూమి అవసరం కానుంది. ఆ మేరకు డి జైన్ రూపొందించాలని కేంద్ర బృందం సూచించి నట్టు సమాచారం. అధికారులు ఆ దిశగా డిజైన్ సిద్ధం చేస్తున్నారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ డిజైన్ తీసుకుని ఢిల్లీ వెళ్లనున్నారు. కేంద్ర బృందం ఇక్కడ రహదారులు, ఎత్తయిన ప్రదేశాలు, సమీపంలో ఉండే నివాసాలు, తదితర విషయాలను సేకరించింది. ఏపీ నిట్‌తో పాటు, ఆక్వా రంగం, విమానాశ్రయం ఏర్పాటైతే దానికి సమీపంలో ఉండే 30 లక్షల జనాభా తదితర అంశాలను అధికారులతో పాటు, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కేంద్ర బృందం దృష్టికి తీసుకువెళ్లారు. వెంకట్రా మన్నగూడెం, జగ్గన్న పేటలో ఇప్పటికే 1123 ఎకరాల భూములను విమానాశ్రయం కోసం గుర్తించారు.శ్రీకాకుళం జిల్లా పలాసలో విమానాశ్రయానికి కేంద్ర బృందం సానుకూ లత వ్యక్తం చేసినట్టు సమాచారం. అక్కడ జీడిమామిడి పంట అధికంగా ఉంది. ఆ లెక్కన జిల్లాలో ఆక్వా రంగం, ఇతర వ్యవసాయ ఉత్పత్తులు ఎగుమతులకు అవ కాశం ఉంటుంది. ఒకవైపు కార్గో, మరోవైపు పౌరవిమానాశ్రయం ఏర్పాటు చేస్తే ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలకు అనుకూలంగా ఉండనుంది. ఇదే విషయాన్ని కేంద్ర బృందా నికి జిల్లా అధికా రులు వివరించే ప్రయత్నం చేశారు. అయితే కొత్తగా ఐదు కిలోమీటర్లు రన్‌వేకు సరి పడేలా భూముల డి జైన్‌ను రూపొందిం చాలని కేంద్ర బృందం సూచిం చింది. భూ సేకరణ విషయం కూడా చర్చకు వచ్చినట్టు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వమే విమానాశ్రయాలకు భూములు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే తాడేపల్లిగూడెంలో కేంద్ర ప్రభుత్వమే సహకరించాలంటూ ఎమ్మెల్యే బొలిశెట్టి కేంద్ర బృందాన్ని కోరారు. తాడేపల్లిగూడెంలో విమానాశ్రయం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సుముఖంగా ఉంది. కేంద్ర కమిటీ నివేదికే ఇప్పుడు కీలకం కానుంది. ఐదు కిలోమీటర్ల రన్‌వేకు తగ్గట్టుగా భూములు, డిజైన్‌ను తయారు చేసి కేంద్ర బృందానికి పంపనున్నారు. తదుపరి బృందం ఇచ్చే నివేదిక ఆధరంగా కేంద్రప్రభుత్వం విమానాశ్రయ ఏర్పాటుపై నిర్ణయం తీసుకోనుంది. కొన్నేళ్ల నుంచి విమానాశ్రయం ఏర్పాటుపై చర్చ జరుగుతూనే ఉంది. తాజాగా కేంద్ర బృందం రావడం, రాష్ట్ర ప్రభుత్వం భూములను గుర్తించడం వంటి అంశాలు విమానాశ్రయ ఏర్పాటుకు మరో ముందడుగుగా అంతా భావిస్తున్నారు.

# విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం: మంత్రి డోలా



**మార్కాపురం, పతాకం న్యూస్:** విభిన్న ప్రతిభావంతుల అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. మార్కాపురం పట్టణంలోని సౌజన్య ఫంక్షన్ హాలులో శుక్రవారం జిల్లా లోని విభిన్న ప్రతిభావంతులకు ఉచిత మూడు చక్రాల స్కూటర్ ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథి గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి డోలా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమం కింద రూ. 17.5 కోట్లతో 1750 మందికి వీటిని అందజేస్తున్నట్లు వివరించారు. మార్కాపురం జిల్లాలో మొదటి విడతగా మొత్తం 40 స్కూటర్లను అందజేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా రూ. 4.32 కోట్లతో దివ్యాంగుల హాస్టల్స్ ను రిపేర్ చేస్తున్నామన్నారు. విశాఖపట్నంలో రూ.200 కోట్లతో ప్యారా స్పోర్ట్స్ స్టేడియం నిర్మాణానికి చర్యలు తీసుకోబోతున్నట్లు తెలిపారు. విభిన్న ప్రతిభావంతులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు డిసబుల్ కమిషన్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. త్వరలో దీనికి పూర్తి స్థాయి అధికారులను నియమిస్తామని వెల్లడించారు. రాష్ట్రంలో 300 విభిన్న ప్రతిభావంతుల బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీకి త్వరలో చర్యలు తీసుకుంటామన్నారు. ఇక ప్రతి జిల్లాలో ఒక దివ్యాంగ భవనాన్ని నిర్మిస్తామని వివరించారు. ప్రతి జిల్లాలో ఆటిజం సెంటర్లు ఏర్పాటు చేసి వాటికి ప్రత్యేక డాక్టర్లను నియమిస్తామన్నారు. జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా విభిన్న ప్రతిభావంతులకు అందజేస్తున్న ఈ స్కూటర్లు వారి దైనందిక జీవితంలో మంచిగా ఉపయోగపడతాయన్నారు. మీకు కృత్రిమ పరికరాలు సైతం అందజేయడం జరుగుతుందని, మరింత విశ్వాసంతో మీరు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. విభిన్న ప్రతిభావంతులకు సమాన అవకాశాలు పొందాలని ఉద్దేశంతోనే ప్రభుత్వం ఇటువంటి మంచి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల -- వయోవృద్ధుల సహాయ సంస్థ చైర్మన్ జి. నారాయణస్వామి, మార్కాపురం గిద్దలూరు, కనిగిరి ఎమ్మెల్యేలు కందుల నారాయణరెడ్డి, ముత్తుముల అశోక్ రెడ్డి, ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ఎర్రగొండపాలెం తెదేపా ఇన్చార్జి గూడూరు ఎరిక్షన్ బాబు, జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్ఓ వెంకట శివరామిరెడ్డి, ఆర్డీవో ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమర్జెన్సీ క్రెడిట్ గ్యారంటీ స్కీమ్ ఉపయోగించుకోండి: మంత్రి శ్రీనివాస్



**అమరావతి, పతాకం న్యూస్:** కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఎమర్జెన్సీ క్రెడిట్ లైన్ గ్యారంటీ స్కీమ్‌తో ఎంఎస్ఎంఈలకు ఎంతో ప్రయోజనమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. పశ్చిమాసియా యుద్ధ పరిణామాల వల్ల నెలకొన్న తాజా పరిస్థితుల్లో దేశంలోని పరిశ్రమలను ఆర్థికంగా ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ ఎమర్జెన్సీ క్రెడిట్ లైన్ గ్యారంటీ స్కీమ్ తీసుకువచ్చిందని మంత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విధానంలో గుర్తింపు పొందిన బ్యాంకులు అందించే అదనపు క్రెడిట్ సదుపాయాలపై కేంద్ర ప్రభుత్వం గ్యారంటీ ఇస్తుందన్నారు. బ్యాంకు రుణాలు తిరిగి చెల్లించలేని పరిస్థితుల్లో ఉన్న పరిశ్రమలకు 100 శాతం, నాన్ ఎంఎస్ఎంఈ రంగాలకు 90 శాతం వరకు కేంద్ర ప్రభుత్వం క్రెడిట్ గ్యారంటీ కవరేజీ ఇస్తుందన్నారు. ఈ పథకం కింద ఒక్కో రుణ గ్రహీత గరిష్ఠంగా రూ.100 కోట్ల వరకు అదనపు రుణం పొందే అవకాశం ఉందన్నారు. ఈ పథకం ద్వారా రుణాలు పొంది ఎంఎస్ఎంఈలను పటిష్ఠం చేసుకోవాలని పారిశ్రామికవేత్తలకు మంత్రి సూచించారు.

## హైదరాబాదులో కారుతో ఢీకొట్టి న్యాయవాది హత్య!

**హైదరాబాద్, పతాకం న్యూస్:** హైదరాబాద్‌లోని మాసాబ్ ట్యాంక్ సమీపంలో న్యాయవాది ఖాజా మొయినుద్దీన్‌ను ఒక కారు ఢీకొట్టింది. ఆయన కారు ఎక్కుతున్న క్రమంలో వెనుక నుంచి వచ్చిన మరో కారు వేగంగా ఢీకొట్టింది. ఆ తర్వాత ఢీకొట్టిన కారు అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఇది గమనించిన కుటుంబసభ్యులు ఖాజా మొయినుద్దీన్‌ను ఆసుపత్రికి తరలించారు. ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కొన్ని గంటలకే మృతి చెందారు. మొదట ఈ ఘటనను పోలీసులు హిట్ అండ్ రన్ కేసుగా నమోదు చేశారు. ఆ తర్వాత పోలీసులు ఈ హిట్ అండ్ రన్ కేసుపై అనుమానాలు వ్యక్తం చేశారు. వక్ఫ్ బోర్డు భూముల వివాదం నేపథ్యంలో ఈ హత్య జరిగినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. నిందితులను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

# నెల్లూరు, ఒంగోలు, విజయవాడ మీదుగా వేసవి ప్రత్యేక రైళ్లు..




**నెల్లూరు, పతాకం న్యూస్:** వేసవి సెలవుల సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం తాంబరం-సంత్రాగచ్చి, తాంబరం-బోడినాయకనూరు మధ్య ప్రత్యేక రైళ్లు నడుపనున్నారు. ఈ మేరకు దక్షిణ రైల్వే విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా.. నెం.06075 తాంబరం-సంత్రాగచ్చి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 26, మే 2వ తేదీల్లో తాంబరం నుంచి ఉదయం 10.15 గంటలకు బయల్దేరి మరుసటిరోజు సాయంత్రం 6.30 గంటలకు సంత్రాగచ్చి చేరుకుంటుంది. మరుమార్గంలో, నెం.06076 సంత్రాగచ్చి-తాంబరం ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 27, జూన్ 3వ తేదీల్లో సంత్రాగచ్చిలో రాత్రి 9.30గంటలకు బయల్దేరి మూడోరోజు ఉదయం 10.30 గంటలకు తాంబరం చేరుకుంటుంది. ఈరైళ్లు చెన్నై ఎగ్మూర్, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, రాజమండ్రి, దువ్వాడ, విజయనగరం, పలాస, ఖుర్దా రోడ్డు మీదుగా నడుస్తాయి. ఈ రైళ్ల ముందస్తు రిజర్వేషన్ శుక్రవారం ఉదయం 8గంటలకు ప్రారంభమవుతుందని దక్షిణ రైల్వే తెలిపింది. నెం.06059 తాంబరం-బోడినాయకనూరు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 23,30, జూన్ 6,13 తేదీల్లో తాంబం నుంచి రాత్రి 10.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 11.15 గంటలకు బోడినాయకనూరు చేరుకుంటుంది. మరుమార్గంలో, నెం.06060 బోడినాయకనూరు-తాంబరం ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 24,31, జూన్ 7,14 తేదీల్లో బోడినాయకనూరు నుంచి సాయంత్రం 4.45 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 6.30 గంటలకు తాంబరం చేరుకుంటుంది.

## పలమనేరు మున్సిపాలిటీలో ఆపరేషన్ క్లీన్ స్వీప్

**చిత్తూరు, పతాకం న్యూస్:** చిత్తూరు జిల్లా పలమనేరు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ అధికారులు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని దినసరి కూరగాయల మార్కెట్ యార్డు, పెద్ద చెరువు కట్ట తదితర ప్రాంతాల్లో స్థానికులు, స్వచ్ఛంద సంస్థలతో కలిసి క్లీనింగ్ చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రతకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, అందులో భాగంగా శనివారం ఆపరేషన్ క్లీన్ స్లీప్ కు పిలుపు నిచ్చిందన్నారు. అందులో భాగంగా పలమనేరు మున్సిపల్ పరిధిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# ఎండలు పెరుగుతున్న వేళ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి

దేశవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు ప్రమాదకర స్థాయికి చేరుతున్న నేపథ్యంలో కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖతోపాటు ఆరోగ్య సేవల విభాగం ప్రజలకు కీలక సూచనలు జారీ చేసింది. తీవ్రమైన ఎండల ప్రభావం వల్ల డీహైడ్రేషన్, హీట్ ఎగ్జాస్టన్, కండరాల పట్టేయడం, మూర్ఛ, తీవ్రమైన పరిస్థితుల్లో హీట్‌స్ట్రోక్ వంటి ప్రాణాపాయ సమస్యలు తలెత్తే అవకాశముందని హెచ్చరించింది. ముఖ్యంగా తలనిర్ఘంధం, వాంతులు, తలనొప్పి, గందరగోళం, వేగంగా గుండె కొట్టుకోవడం, గాఢ పసుపు రంగు మూత్రం, అపస్మారక స్థితి వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయవద్దని సూచించింది. వేసవిలో దాహం వేయకపోయినా తరచూ నీరు తాగడం చాలా ముఖ్యమని సూచించింది. దాహం లేకపోవడం అంటే శరీరానికి నీరు అవసరం లేదని కాదని స్పష్టం చేసింది. శరీరాన్ని చల్లగా ఉంచేందుకు ఇంట్లో తయారు చేసే సంప్రదాయ పానీయాలను తీసుకోవాలని సూచించింది.



చాస్, లస్సీ వంటి పానీయాలు వేసవిలో శరీరాన్ని చల్లబరచడంలో ఎంతో ఉపయోగపడతాయని తెలిపింది. ఇవి శరీరానికి తేమను అందించడమే కాకుండా జీర్ణక్రియకు కూడా సహాయపడతాయని పేర్కొంది. కొబ్బరి నీరు సహజ ఎలక్ట్రోలైట్స్‌తో నిండిన ఉత్తమ పానీయంగా పేర్కొంది. ఇది శరీరంలో కోల్పోయిన ఖనిజాలను తిరిగి భర్తీ చేయడంలో సహాయపడుతుందని తెలిపింది. నిమ్మరసం వేసవిలో అత్యంత సులభమైన, ప్రభావవంతమైన పానీయమని సూచించింది. కొద్దిగా ఉప్పు కలిపి తీసుకుంటే శరీరంలో ఎలక్ట్రోలైట్ సమతుల్యతను కాపాడుతుందని పేర్కొంది. సత్తు పానీయం కూడా వేసవిలో శక్తిని ఇచ్చే చల్లని పానీయంగా సూచించింది. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా ఉపయోగించే ఈ పానీయం శరీర వేడిని తగ్గించడంలో సహాయపడుతుందని తెలిపింది. అలాగే ఆమ్ పన్నా శరీర ఉష్ణోగ్రతను తగ్గించి చెమట ద్వారా కోల్పోయిన లవణాలను భర్తీ చేస్తుందని పేర్కొంది. హీట్ ఎగ్జాస్టన్ నివారణలో ఇది ఉపయోగకరమని తెలిపింది. బేల్ శర్బత్‌ను సహజ శీతల పానీయంగా వివరించింది. ఇది శరీరానికి చల్లదనాన్ని అందించడంలో సహాయపడుతుందని పేర్కొంది. ఇక దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి చెందిన నన్నారి పానకం కూడా వేసవిలో ఉపయోగకరమైన పానీయమని తెలిపింది. నన్నారి సిరప్, నిమ్మరసం, సబ్జా గింజలు కలిపి తయారుచేసే ఈ పానీయం శరీరాన్ని తాజాగా ఉంచుతుందని పేర్కొంది. మజ్జిగలో ఉసిరికాయ, కరివేపాకు, అల్లం, సేంద్రీయ ఉప్పు కలిపి తయారు చేసే గూస్‌బెర్రీ బటర్‌మిల్క్ కూడా శరీరానికి చల్లదనాన్ని అందిస్తుందని సూచించింది. వేసవిలో ఎక్కువ నీటి శాతం ఉన్న పండ్లు, కూరగాయలు తీసుకోవాలని సూచించింది. పుచ్చకాయ శరీరాన్ని వెంటనే చల్లబరచడంలో సహాయపడుతుందని తెలిపింది. తర్బూజా కూడా శరీరానికి తేమను అందించే ఉత్తమ పండుగా పేర్కొంది. దోసకాయను సలాడ్, రైతా లేదా నేరుగా ఉప్పుతో తీసుకోవచ్చని, ఇది శరీర ఉష్ణోగ్రతను తగ్గించడంలో సహాయపడుతుందని తెలిపింది.

ద్రాక్షలో సహజ చక్కెరలు, నీటి శాతం అధికంగా ఉండటంతో శక్తిని నిలబెట్టడంలో ఉపయోగపడుతుందని పేర్కొంది. కొబ్బరి బొండంలోని మృదువైన తురుము కూడా శరీరానికి చల్లదనాన్ని అందించే పోషకాహారంగా సూచించింది. బూడిద గుమ్మడికాయను ఆయుర్వేదం, సిద్ధ వైద్యంలో చల్లదనాన్ని ఇచ్చే ఆహారంగా భావిస్తారని తెలిపింది. దీన్ని వంటల్లో లేదా పానీయాల రూపంలో తీసుకోవచ్చని సూచించింది. టమాటాలు, లెట్యూస్ వంటి నీటి శాతం అధికంగా ఉండే కూరగాయలను తేలికపాటి ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించింది. అలాగే తీవ్రమైన ఎండల సమయంలో మద్యం, అధిక టీ, కాఫీ, కార్బొనేటెడ్ శీతల పానీయాలు, అధిక చక్కెర కలిగిన డ్రింక్స్, ఎక్కువ నూనెతో చేసిన వంటకాలు, అధిక ప్రోటీన్ ఆహారాలను తగ్గించాలని హెచ్చరించింది. ఇవి శరీరంలో వేడిని పెంచి డీహైడ్రేషన్ సమస్యను మరింత తీవ్రతరం చేసే అవకాశం ఉందని తెలిపింది. సాంప్రదాయ భారతీయ వేసవి ఆహారాలు, పానీయాలు ప్రస్తుత కాలంలో మరింత అవసరమని ఈ మార్గదర్శకాలు స్పష్టం చేస్తున్నాయి.

# ఏపీఎఫ్‌డీసీ కాఫీ తోటలు పునరుద్ధరణ

## 10 లక్షల మేలిజాతి మొక్కల నర్సరీలు అభివృద్ధి



**గూడెంకొత్తవీధి, పతాకం న్యూస్:** పాడేరు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఏపీఎఫ్‌డీసీ 1975 నుంచి కాఫీ సాగు చేపడుతున్నది. నాణ్యమైన కాఫీ ఉత్పత్తి చేసి మన్యం కాఫీ ఘుమఘుమలను ఖండంతరాలకు ఏపీఎఫ్‌డీసీ విస్తరించింది. సంస్థ ఉత్పత్తి చేసిన కాఫీ గింజలకు 12 సార్లు డివిజన్, జాతీయ స్థాయిలో ఫైన్‌కప్ అవార్డులు వచ్చాయి. అప్పట్లో ఏపీఎఫ్‌డీసీ రికార్డు స్థాయిలో లాభాలను1 అర్జించింది. ప్రతి ఏటా రూ.22 నుంచి రూ.25 కోట్ల లావాదేవీలు నిర్వహించేది. ఏపీఎఫ్‌డీసీ కాఫీ తోటల్లో ఆరు వేల మంది కార్మికులు పనిచేసుకుంటూ ఉపాధి పొందేవారు. కొంత కాలంగా ఏపీఎఫ్‌డీసీ కాఫీ తోటల్లో దిగుబడులు తగ్గాయి. దీనికితోడు మావోయిస్టులు కాఫీ తోటలు పంపిణీ చేయడంతో సంస్థ నష్టాలను ఎదుర్కోవాల్సి వచ్చింది. ప్రస్తుతం ఏజెన్సీ పది మండలాల్లో మినుములూరు, చింతపల్లి ఉత్తర, దక్షిణం, ఆర్‌వీనగర్ తూర్పు, పడమర డివిజన్ల పరిధిలో 4,010 హెక్టార్లలో ఏపీఎఫ్‌డీసీ కాఫీ సాగుచేపడుతోంది. మావోయిస్టుల ఉద్యమం ఏపీఎఫ్‌డీసీపై తీవ్ర ప్రభావం చూపింది. మావోయిస్టులు సంస్థకు చెందిన కాఫీతోటలను ఆదివాసీలకు పంపిణీ చేసేయడంతో సాగు విస్తీర్ణం పడిపోయింది. మావోయిస్టులు ఏపీఎఫ్‌డీసీ సాగులోనున్న కాఫీ తోటలన్నీ ఆదివాసీలకే చెందాలని 1989 నుంచి ఆందోళ చేస్తూ 1996వ సంవత్సరంలో ఏపీఎఫ్‌డీసీ ఆస్తులపై ప్రత్యక్ష దాడులు ప్రారంభించారు. ఉద్యోగులు తోటలను విడిచి వెళ్లిపోవాలని పలుమార్లు హెచ్చరిస్తూ ఉద్యమాన్ని ఉధృతం చేశారు. 2012 నుంచి మావోయిస్టు పార్టీ సంస్థకు చెందిన కాఫీతోటలను ఆదివాసీలకి పంపిణీ చేయడం ప్రారంభించింది. ఐదేళ్లలో చింతపల్లి దక్షిణం, ఉత్తర డివిజన్లలో బలపం ప్రాంతంలో 100 హెక్టారులు, పెదవలస ఎస్టేట్‌లో 200 హెక్టారులను ఆదివాసీలకి పంపిణీ చేశారు. అలాగే ఆర్‌వీనగర్ తూర్పు, పడమర డివిజన్లలోనూ దాదాపు 600 హెక్టారుల కాఫీ తోటలను ఆదివాసీలకు పంపిణీచేశారు. ప్రస్తుతం ఆర్‌వీనగర్ తూర్పు, పడమర డివిజన్ల పరిధిలో మావోయిస్టులు పంపిణీ చేయగా మిగిలిన 1276.26హెక్టార్లలో కాఫీ సాగు జరుగుతున్నది. మావోయిస్టులు ఆదివాసీలకు పంపిణీచేసిన తోటలను పోలీసుల సహకారంతో తిరిగి స్వాధీనం చేసుకోవాలని గత ప్రభుత్వం ప్రయత్నించినప్పటికీ ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చింది. కూటమి ప్రభుత్వం ఈ చర్యలను పూర్తిగా విరమించుకుంది. ఏపీఎఫ్‌డీసీ కాఫీ తోటలను బలోపేతరం చేసేందుకు ఈ ఏడాది కార్యాచరణ ప్రారంభించింది. 1996 నుంచి ఏపీఎఫ్‌డీసీ కావేరి రకం మొక్కలను నాటడం జరిగింది. ఈ మొక్కలు ప్రస్తుతం దిగుబడులు ఇవ్వడం లేదు. అలాగే ఏపీఎఫ్‌డీసీ తోటల్లో సుమారు 40 నుంచి 50 ఏళ్ల వయస్సు కలిగిన మొక్కలు ఉన్నాయి. ఈ మొక్కలు వయస్సు మీరిపోవడం వల్ల ఆశించి దిగుబడులు రావడం లేదు. దీంతో కాఫీ తోటలను పునరుద్ధరించేందుకు వయస్సు మీరిన మొక్కలు, కావేరి రకం మొక్కలను తొలగించి కొత్త మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఆర్‌వీనగర్, చింతపల్లి ప్రాంతాల్లో చంద్రగిరి, సెలక్షన్-5 రకం కాఫీ మొక్కల నర్సరీలను అభివృద్ధి చేస్తున్నారు. హెక్టారుకి 1,850 మొక్కలు నాటనున్నారు. ఏపీఎఫ్‌డీసీ ఐదు డివిజన్ల పరిధిలో పది లక్షల మొక్కలను పెంచుతున్నది. అలాగే నీడనిచ్చేందుకు మారుజాతి మొక్కల నర్సరీలను సైతం పెంచుతున్నారు. రెండు నెలల్లో తొలకరి వర్షాలు ప్రారంభం కాగానే ఈ మొక్కలను తోటల్లో నాటుతామని ఏపీఎఫ్‌డీసీ అధికారులు తెలిపారు. రానున్న రోజుల్లో గతంలో మాదిరిగా దిగుబడులు సాధించడంతోపాటు ఆదివాసీలకు కాఫీ తోటల ద్వారా ఉపాధి కల్పించేందుకు ఏపీఎఫ్‌డీసీ ముందడుగు వేస్తున్నది.

# పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు.. ఇరాన్ గగనతలం మూసివేత



**ఇరాన్:** పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న వేళ కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. అమెరికా-ఇరాన్ మధ్య చర్చలు కొనసాగుతుండగానే .... మరోవైపు ఇరాన్‌పై మళ్లీ దాడి చేసే అవకాశాలను అమెరికా పరిశీలిస్తోందన్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇదే సమయంలో ఇరాన్ తన గగనతలంలోని పశ్చిమ ప్రాంతాన్ని తాత్కాలికంగా మూసివేస్తూ నోటమ్ జారీ చేసింది. ఈ నెల 25వ తేదీ వరకు ఆ ప్రాంతంలో విమానాల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు ఇరాన్ పౌర విమానయాన సంస్థ ప్రకటించింది. ఈ నిర్ణయం వెలువడే సమయంలో ఖతార్‌కు చెందిన ఓ విఐపి విమానం ఇరాన్ గగనతలాన్ని దాటినట్లు సమాచారం. శాంతి చర్చల నిమిత్తం టెహ్రాన్‌కు వెళ్లిన ఖతార్ ప్రతినిధి బృందం ఆ విమానంలో ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు అమెరికా--ఇరాన్ మధ్య జరుగుతున్న చర్చలు తుది దశకు చేరుకున్నాయని, పలు కీలక అంశాల్లో ఇరు దేశాలు ఏకాభిప్రాయానికి వచ్చినట్లు అంతర్జాతీయ వర్గాలు చెబుతున్నాయి. దీంతో త్వరలోనే ఒప్పంద ప్రకటన వెలువడే అవకాశం ఉందని భావిస్తున్నారు. అయితే .... చర్చలు చివరి నిమిషంలో విఫలమైతే ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై మళ్లీ దాడులు చేపట్టే అంశాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఇరాన్ గగనతలాన్ని మూసివేయడం పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మార్చింది. దీంతో పశ్చిమాసియాలో ఏ క్షణాన ఏమి జరుగుతుందోనన్న అనిశ్చితి నెలకొంది.




# క్రికెట్‌కు గుడ్‌బై చెప్పిన విజయ్ శంకర్



ఆల్‌రౌండర్ విజయ్ శంకర్ దేశవాళీలతోపాటు ఐపీఎల్‌కు వీడ్కోలు పలుకుతున్నట్టు శుక్రవారం ప్రకటించాడు. కొత్త అవకాశాలను అందిపుచ్చుకొనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు వివరించాడు. తమిళనాడుకు చెందిన 35 ఏళ్ల విజయ్ 2018-2019 మధ్య 12 వన్డేలు, 9 టీ20లలో టీమిండియాకు ప్రాతినిధ్యం వహించాడు. 'క్రికెట్ నా జీవితం. 10 ఏళ్ల వయస్సు నుంచే ఆడడం ప్రారంభించిన నేను.. 25 సంవత్సరాల తర్వాత క్రికెట్‌లో అన్ని స్థాయిల్లో ఆడినందుకు గర్విస్తున్నా.. మీ 3డీ విజయ్ శంకర్' అంటూ సోషల్‌మీడియాలో అతడు పోస్ట్ చేశాడు. 2019 వన్డే వరల్డ్ కప్‌లో మాంచెస్టర్‌లో వెస్టిండ?సతో ఆడిందే అతడి చివరి అంతర్జాతీయ మ్యాచ్. కాలి వేలి గాయంతో ఆపై మెగా టోర్నీ మొత్తానికి దూరమయ్యాడు. ఐపీఎల్‌లో చెన్నై, సన్‌రైజర్స్, ఢిల్లీ, గుజరాత్ జట్లకు విజయ్ ప్రాతినిధ్యం వహించాడు. 2019 వరల్డ్‌కప్‌లో తెలుగు క్రికెటర్ అంబటి రాయుడుకు స్థానం ఖాయమని భావించగా, చివరి నిమిషంలో అతడిని కాదని ఆల్‌రౌండర్ విజయ్ శంకర్‌కు జట్టులో చోటు కల్పించడం వివాదాస్పదమైంది. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో సత్తాచాటే 3డీ క్రికెటర్‌గా విజయ్‌ను ఎంపిక చేసినట్టు అప్పట్లో చీఫ్ సెలెక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ వివరణ ఇచ్చుకున్నాడు. దీంతో తాను 3డీ కళ్లద్దాలతో వరల్డ్ కప్ మ్యాచ్‌ను చూస్తానంటూ రాయుడు నాడు వ్యంగ్యంగా పోస్ట్ చేయడం వైరల్‌గా మారింది.

## అభిషేక్, ఇషాన్, క్లాసెన్ అర్ధ సెంచరీలు

# సన్ రైజర్ హైదరాబాద్ విజయం



సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 255 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఇషాన్ కిషన్ (46 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్సర్లతో 79), అభిషేక్ శర్మ (22 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సర్లతో 56), క్లాసెన్ (24 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సర్లతో 51), నితీశ్ (12 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సర్లతో 29 నాటౌట్) వేగంగా ఆడారు. రసిఖ్‌కు 2 వికెట్లు దక్కాయి. అయితే ఛేదనలో బెంగళూరు 166 పరుగులు చేస్తే తమ అగ్రస్థానానికి ఢోకా లేని పరిస్థితి ఉండగా.. ఆ జట్టు 20 ఓవర్లలో 4 వికెట్లకు 200 పరుగులు చేసింది. దీంతో ఫలితం ఎలా ఉన్నా ఆర్‌సీబీ టాప్ స్థానానికి ముప్పు లేకుండాపోయింది. కెప్టెన్ రజత్ పటీదార్ (39 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్‌తో 56), వెంకటేశ్ అయ్యర్ (19 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్లతో 44), క్రునాల్ పాండ్యా (31 బంతుల్లో 5 ఫోర్లతో 41 నాటౌట్) రాణించారు. మలింగకు రెండు వికెట్లు లభించాయి. ఇషాన్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

భారీ ఛేదనలో ఆర్‌సీబీ తడబడింది. హిట్టింగ్ కోసం ఓపెనర్‌గా బరిలోకి దిగిన వెంకటేశ్ అయ్యర్‌తో పాటు మధ్య ఓవర్లలో రజత్ పటీదార్, క్రునాల్ పాండ్యా ఆకట్టుకున్నారు. కానీ రైజర్స్ బౌలర్లు ఆరంభం నుంచే మ్యాచ్‌ను అదుపులో ఉంచారు. దీంతో సాధించాల్సిన రన్‌రేట్ భారీగా పెరగడంతో బెంగళూరు చేసేదేమీ లేకపోయింది. తొలి ఓవర్‌లోనే అయ్యర్ 4,6 బాదగా.. నాలుగో ఓవర్‌లో 6,4,6,6తో 23 రన్స్ రాబట్టాడు. కానీ తర్వాతి ఓవర్‌లోనే అతడిని పేసర్ మలింగ అవుట్ చేశాడు. అటు వచ్చీ రాగానే దేవ్‌దత్ పడిక్కళ్ 4,6తో జోరు చూపాడు. ఇక ఆరో ఓవర్‌లో కోహ్లీ(15)ని పేసర్ సకీబ్ దెబ్బతీయగా.. పవర్‌ప్లేలో ఆర్‌సీబీ 75/2తో నిలిచింది. అనంతరం పరుగులు నెమ్మదించగా.. దేవ్‌దత్ (21)ను మలింగ అవుట్ చేశాడు. ఈ దశలో రజత్-క్రునాల్ జోడీ రైజర్స్ బౌలింగ్‌ను దీటుగా ఎదుర్కొంది. గెలుపుపై ఆశలు లేకపోవడంతో వీరు వికెట్‌ను కాపాడుకునేందుకు ప్రయత్నించారు. అడపాదడపా బౌండరీలతో ముందుకు సాగారు. మరోవైపు 17వ ఓవర్‌లో స్కోరు 166 దగ్గర ఆర్‌సీబీ టాప్-2 బెర్త్ ఖాయమైంది. హాఫ్ సెంచరీ తర్వాత రజత్ 19వ ఓవర్‌లో వెనుదిరిగాడు. నాలుగో వికెట్‌కు క్రునాల్-రజత్ 84 రన్స్ జోడించారు. 6 బంతుల్లో 71 రన్స్ కావాల్సిన వేళ.. 15 రన్స్‌కే పరిమితమైన బెంగళూరు 200 స్కోరు చేసి ఓడింది.

టాస్ గెలిచిన సన్‌రైజర్స్ బ్యాటింగ్ ఎంచుకుంది. వారి వ్యూహానికి తగ్గట్టుగానే టాపార్డర్ కదం తొక్కింది. ఇషాన్ కిషన్, ఓపెనర్ అభిషేక్, క్లాసెన్ మెరుపు అర్ధసెంచరీలతో విరుచుకుపడడంతో రైజర్స్ రయ్‌మంటూ దూసుకెళ్లింది. కొత్త బంతితో పేసర్లు భువనేశ్వర్, హాజెల్‌వుడ్ వికెట్లు తీయలేకపోయారు. కానీ డెత్ ఓవర్లలో ఆర్‌సీబీ కాస్త పట్టు సాధించినా, అప్పటికే రైజర్స్ ఖాతాలో 250ం పరుగుల భారీ స్కోరు చేరింది. నాలుగో ఓవర్‌లో 3 ఫోర్లు బాదిన ఓపెనర్ హెడ్ (26) అదే ఓవర్‌లో వెనుదిరిగాడు. పవర్‌ప్లేలో 63/1 పరుగులతో రైజర్స్ ఓ మాదిరిగానే కనిపించింది. కానీ ఆ తర్వాత అభిషేక్ జోరుకు స్కోరులో వేగం పెరిగింది.




# ఆస్ట్రేలియాలో 'పెద్ది' రికార్డు... తొలి చిత్రంగా అరుదైన ఘనత




గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో వస్తున్న 'పెద్ది' చిత్రం విడుదల విషయంలో సరికొత్త రికార్డు సృష్టించింది. ఈ రూరల్ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుండగా, ఓవర్సీస్‌లో ముఖ్యంగా ఆస్ట్రేలియాలో భారీ స్థాయిలో రిలీజ్ అవుతోంది. అక్కడి ప్రముఖ సినిమా చైన్ 'హోయిట్స్'కు సంబంధించిన అన్ని లొకేషన్లలోనూ విడుదల కానున్న తొలి చిత్రంగా 'పెద్ది' చరిత్ర సృష్టించనుంది.

ఈ చిత్రాన్ని ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఫిజీ దేశాల్లో ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ ప్రత్యంగిరా ఓవర్సీస్ పంపిణీ చేస్తోంది. సాధారణంగా పెద్ద సినిమాలు కూడా ఎంపిక చేసిన కొన్ని హోయిట్స్ థియేటర్లలో మాత్రమే విడుదలవుతాయి. కానీ, 'పెద్ది' చిత్రాన్ని ఆస్ట్రేలియాలోని అన్ని హోయిట్స్ సెంటర్లలోనూ ప్రదర్శించనుండటం విశేషం. ఇది తెలుగు సినిమాకు అంతర్జాతీయంగా పెరుగుతున్న ఆదరణకు నిదర్శనమని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

ఈ సినిమాలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ భారీ విడుదల ప్రకటనతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.

# ఆకట్టుకుంటున్న ఇంటెన్స్ ఫస్ట్ లుక్ 'సమవర్తి'గా వస్తున్న సత్యదేవ్..

విలక్షణమైన పాత్రలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు సత్యదేవ్, ఇప్పుడు పూర్తిస్థాయి యాక్షన్ అవతారంలోకి మారుతున్నారు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న కొత్త చిత్రానికి 'సమవర్తి' అనే టైటిల్‌ను శుక్రవారం అధికారికంగా ప్రకటించారు. దర్శకుడు అజయ్ నాగ్ వి తెరకెక్కిస్తున్న ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను కూడా విడుదల చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్ సినిమాపై అంచనాలను పెంచుతోంది. ఇందులో సత్యదేవ్ హెడ్‌ఫోన్స్ పెట్టుకుని ప్రశాంతంగా సంగీతం వింటుండగా, ఆయనపై గొడ్డళ్లు, కత్తులతో కొందరు వ్యక్తులు దాడికి వస్తున్నట్లు చూపించారు. పోస్టర్ బ్యాక్‌గ్రౌండ్‌లో పులి బొమ్మ ఉండటం మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ పోస్టర్‌ను షేర్ చేస్తూ, "ఈసారి ఇచ్చిన మాట నిలబెట్టుకుంటాం!!" అని సత్యదేవ్ తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు. నాయకుడిగా సత్యదేవ్‌కు ఇది 16వ చిత్రం. 'ఎకోలాజికల్ యాక్షన్ థ్రిల్లర్' అనే కొత్త జానర్‌లో ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు చిత్ర యూనిట్ తెలిపింది. ప్రకృతి నేపథ్యంలో సాగే యాక్షన్, పర్యావరణ సంఘర్షణల కలయికతో ఈ చిత్రం ఉండనుంది. రుద్ర పిక్చర్స్, పంచభూత ప్రొడక్షన్స్ బ్యానర్లపై శివచరణ్ రెడ్డి జక్కిడి, శశిధర్ రెడ్డి పడమటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ భాషల్లోనూ 'సమవర్తి'ని గ్రాండ్‌గా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రంలో దిలీష్ పోతన్, రాజీవ్ కనకాల, గానవి



లక్ష్మణ్, రవీంద్ర విజయ్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. సింజిత్ యర్రమిల్లి సంగీతం అందిస్తుండగా, హర్ష మల్లికార్జున్, దేవ్ దీప్ గాంధీకుండు సినిమాటోగ్రఫీ బాధ్యతలు చేపట్టారు.






# 18 ఏళ్ల తర్వాత మమ్ముట్టి, మోహన్ లాల్..

## ఓటీటీలో పొలిటికల్ థ్రిల్లర్ 'పేట్రియాట్'



మలయాళ సినీ దిగ్గజాలు మమ్ముట్టి, మోహన్ లాల్ 18 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ కలిసి నటించారు. వీరు ప్రధాన పాత్రలు పోషించిన పొలిటికల్ థ్రిల్లర్ 'పేట్రియాట్'. ఈ చిత్రాన్ని ప్రముఖ దర్శకుడు మహేష్ నారాయణన్ తెరకెక్కించారు. జూన్ 5 నుంచి ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ జీ5లో ఈ సినిమా స్ట్రీమింగ్ కానుంది. మలయాళంతో పాటు తెలుగు, హిందీ, తమిళం, కన్నడ భాషల్లోనూ ఇది అందుబాటులో ఉండనుంది.

దేశ భద్రత కోసం ఓ అత్యాధునిక నిఘా వ్యవస్థను రూపొందించిన వ్యక్తి, అదే వ్యవస్థను అడ్డం పెట్టుకుని కొందరు అమాయకులను బ్లాక్‌మెయిల్ చేస్తుండటాన్ని గుర్తిస్తాడు. దీంతో తను సృష్టించిన వ్యవస్థకే ఎదురు తిరుగుతాడు. ఈ క్రమంలో దేశభక్తి, దేశద్రోహం మధ్య ఉండే సన్నని గీతపై అతను చేసే పోరాటమే ఈ చిత్ర కథాంశం. గూఢచర్యం, రాజకీయాలు, టెక్నాలజీ, భావోద్వేగాలను కలగలిపి ఈ చిత్రాన్ని రూపొందించారు. మమ్ముట్టి, మోహన్ లాల్‌తో పాటు నయనతార, ఫహాద్ ఫాజిల్, కున్‌చాకో బొబన్ వంటి భారీ తారాగణం ఈ సినిమాలో నటించడం విశేషం. రేవతి, రాజీవ్ మీనన్ తదితరులు ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమాపై దర్శకుడు మహేష్ నారాయణన్ మాట్లాడుతూ, "ప్రజలను రక్షించాల్సిన టెక్నాలజీనే వారిని భయపెట్టే ఆయుధంగా మారితే ఎలా ఉంటుందనే ఆలోచనతో ఈ కథ రాశాం" అని తెలిపారు.

మమ్ముట్టి మాట్లాడుతూ, "ఇది కేవలం పొలిటికల్ థ్రిల్లర్ మాత్రమే కాదు, మనస్సాక్షి, బాధ్యత గురించి చెప్పే బలమైన కథ" అన్నారు. ఇక, చాలా ఏళ్ల తర్వాత మమ్ముట్టితో కలిసి నటించడం ప్రత్యేక అనుభూతినిచ్చిందని మోహన్ లాల్ పేర్కొన్నారు. "నిజం, అధికారం మధ్య జరిగే సంఘర్షణే ఈ సినిమా" అని ఆయన వివరించారు.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**